# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 269 | హైదరాబాద్ | మంగళవారం 21-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం



11లో


## జగిత్యాల సభకు హరీశ్ దూరం వ్యూహాత్మకమేనా?

- చాలా రోజుల తర్వాత జగిత్యాలలో కేసీఆర్ బహిరంగ సభ
- ఈ కీలక సభకు దూరంగా హరీశ్ రావు.. హుటాహుటిన ఢిల్లీకి
- కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయసలహా కోసం పయనం
- ఎమ్మెల్యేల ఫిరాయింపులపైనా న్యాయపరమైన కార్యాచరణకు సన్నాహాలు
- హరీశ్‌తో పాటు వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర కూడా ఢిల్లీకి

## అక్షర వ్యాపారం.. ఫీజుల 'వేట'!

- ఎస్సార్ గాయత్రీలో ఫీజుల దందా.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం!
- బకాయిలు ఉంటే ఫీజు తీసుకోబోం యాజమాన్యం మొండి వైఖరి
- బోధనలో వైఫల్యం.. ఫెయిల్యూర్ల ప్రభంజనంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న "కార్పొరేట్ విద్యా నియంత్రణ జే.ఏ.సీ"

12లో









## గులాబీ గూటికి జీవన్ రెడ్డి.. వెంటనే కీలక బాధ్యతలు!

- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటన
- తెలంగాణ భవిష్యత్తు ప్రయోజనాల కోసం జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరినట్లు వెల్లడి
- కరీంనగర్ జిల్లా బాధ్యతలు అప్పగిస్తానన్న కేసీఆర్

11లో







11లో

## 100 పర్సంటైల్‌తో అదరగొట్టిన తెలుగు తేజాలు!

- జేఈఈ మెయిన్ 2026 సెషన్-2 ఫలితాలు విడుదల
- దేశవ్యాప్తంగా 26 మందికి 100 పర్సంటైల్
- వంద పర్సంటైల్ సాధించిన వారిలో 10 మంది తెలుగు విద్యార్థులు
- టాప్ 2.50 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత
- మే 17న జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



## కాళేశ్వరం ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

11లో

- భూపాలపల్లి జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం
- రూ.198 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శ్రీకారం

## భారత్ - కొరియా సరికొత్త బంధం

- మూడు రోజుల భారత పర్యటనకు వచ్చిన దక్షిణ కొరియా అధ్యక్షుడు
- ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా పలు ఒప్పందాలు
- ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా భాగస్వామ్యం

11లో





## ఐటీ హబ్ నిర్మాత బాబు: ఎంపీ అరవింద్

- నేడు ఏపీ సీఎం చంద్రబాబు 76వ పుట్టినరోజు
- శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ ఎంపీ అరవింద్
- 1990లలోనే స్పష్టమైన విజన్‌తో చంద్రబాబు పనిచేశారని ప్రశంస
- హైటెక్ సిటీతో లక్షలాది ఉద్యోగాలు సృష్టించారని కితాబు

11లో

భారతశక్తి

# ఎన్డీయే నెక్స్ట్ ఏంటీ...

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు బిల్లులు వీగిపోతాయని ఆరవ తరగతి చదివే విద్యార్థి కూడా చెప్పగలడు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే హాజరయిన సభ్యులలో తప్పనిసరిగా మూడింట రెండువంతుల బలం ఉంటే తప్ప సాధ్యం కాదన్న విషయం నరేంద్ర మోడీకి, ఆయన ప్రభుత్వంలోని పెద్దలందరికీ బాగా తెలుసు. అయినా సరే, కేంద్ర ప్రభుత్వం ఈ మూడు బిల్లులను ప్రతిపాదించేందుకు ఈ సమయాన్ని ఎందుకు ఎంచుకున్నట్టు? ఇందులో ఒకటి చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు. రెండవది నియోజక వర్గాల పునర్విభజనకు సంబంధించినది. మూడవది కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణకు సంబంధించిన బిల్లు. నిజానికి మామూలు పరిస్థితుల్లో ప్రతిపక్షాలు కూడా వీటిని వ్యతిరేకించవలసిన అవసరం లేదు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లు. ఈ బిల్లు నిజానికి 2023లోనే ఏకగ్రీవంగా పార్లమెంట్ ఆమోదం పొంది ఉన్నది. దానిని ప్రస్తుతం డీలిమిటేషన్‌తో లింక్ చేస్తూ తీసుకురావడాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ భాషలో చెప్పాలంటే ప్రతిపక్షాలను వాటికి ఆమోదం కానీ అంశంలో ఒప్పించేందుకు ఒక చీరను చుట్టి తీసుకొచ్చారు. పోలిక అభ్యంతరకరంగా ఉండవచ్చు కానీ ఆయన ఉద్దేశం డీలిమిటేషన్ బిల్లును మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో తీసుకువచ్చారు అని. ఒకవైపు ఐదు రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు జరుగుతుండగా, ముఖ్యమైన రెండు రాష్ట్రాలలో (పశ్చిమ బెంగాల్, తమిళనాడు) పోలింగ్ ఇంకా జరగాల్సి ఉండగా ఇంత హడావుడిపడి బిల్లులు ఎందుకు ప్రవేశపెట్టాలనుకున్నట్టు?2029 ఎన్నికలలో మహిళాబిల్లుకు విపక్షాలు అడ్డుకొట్టాయన్న నినాదం తీసుకుని జనంలోకి వెళ్ళే ఆలోచన బిజెపి చేస్తున్నదని. అదే నిజమని ఒకటికి రెండుసార్లు శుక్రవారం సభలోపలా వెలుపలా జరిగిన సంఘటనలు స్పష్టం చేశాయి. సభలో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిన వెంటనే భారతీయ జనతా పార్టీ, దాని మిత్రపక్షాల మహిళాసభ్యులంతా ముందే తయారు చేయించి పెట్టుకున్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేయడం ఒక ఉదాహరణ. అంతేకాదు, అంతకు ముందురోజు రాత్రి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా దేశంలోని మహిళలంతా తమవైపు చూస్తున్నారనీ, విపక్షాలు మద్దతు ఇవ్వకపోయినా, బిల్లు వీగిపోయినా తనకే లాభం అని చేసిన హెచ్చరికలాంటి వ్యాఖ్యలు అయినా, చివరగా చర్చకు సమాధానమిస్తూ హోంమంత్రి అమిత్ షా మాట్లాడిన మాటలు అయినా కచ్చితంగా ఈ సవరణ బిల్లు వీగిపోనున్నదని వారికి ముందే తెలుసునన్న విషయం స్పష్టం చేశాయి. అంతేకాదు, ఇదంతా మోడీ ప్రభుత్వం ఒక రాజకీయ ఎత్తుగడగా చేసిందని అర్థమైంది. ఈ బిల్లును వ్యతిరేకించడానికి మొత్తం ప్రతిపక్షం ఒక్కటైందన్న విషయం కూడా రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్ష సభ్యులందరి మాటల్లో స్పష్టంగా అర్థం అయింది. ప్రజాస్వామ్యంలో ఒక్కోసారి ప్రతిపక్షానిది పైచేయి కావడం పెద్ద విశేషమేమీ కాదు. ప్రజాస్వామ్యానికి ఉండే గొప్పతనమే అదని మర్చిపోకూడదు. గెలుపు ఓటముల మాట అలా ఉంచితే ఎన్‌డిఎ ఎందుకు ఇలా చేసింది? ప్రతిపక్షాలు ఎందుకు దీనిని వ్యతిరేకించాయి? లోకసభలో ఓటింగ్ పూర్తయి మహిళా బిల్లు వీగిపోయిందన్న వార్త వెలువడిన క్షణాల్లోనే ఫెమినిస్టుల దగ్గరినుండి సామాన్యుల దాకా చాలామంది 'అయిపోయింది, మహిళలకు మళ్లీ మొండిచెయ్యి చూపించారు' అని సామాజిక మాధ్యమాల్లో విరుచుకుపడ్డారు. ఎన్‌డిఎ ఆశించింది అదే. ఇండియా కూటమితోబాటు మిగిలిన పక్షాలన్నీ దీని మీద మహిళా లోకానికి సంజాయిషీ లేదా వివరణ ఇచ్చుకుంటూ దేశమంతా తిరగాలన్నది ఎన్‌డిఎ పథకం. మహిళా సంఘాలు, ఫెమినిస్టులు మరోసారి నిరాశ చెందడానికి కారణం ఉంది. 30 ఏళ్ళుగా వాళ్ళు ఎంత ప్రయత్నించినా మహిళా రిజర్వేషన్ల వ్యవహారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నది. సభలో బిల్లు వీగిపోగానే అధికారపక్ష మహిళాసభ్యుల నిరసనతో మొదలై ఎన్‌డిఎ ఇచ్చిన పిలుపుమేరకు శనివారంనాడు దేశమంతటా 'ప్రతిపక్షాలు మహిళా వ్యతిరేకులు' అంటూ ఎన్‌డిఎ పక్షాలు నిరసన మొదలుపెట్టాయి. 'చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు మేం ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు వాళ్ళని సభలోకి రాకుండా అడ్డుకుంటున్నాయి' అన్న ప్రచారం పెద్దయెత్తున ఎన్‌డిఎ పక్షాలు మొదలుపెట్టాయి. మీడియాలో అత్యధికులు దీనికి వంతపాడటంలో ఆశ్చర్యమేమీలేదు. కొన్ని తెలుగు పత్రికలు 'నెగ్గని మహిళా కోటా, ఆమెకు మళ్లీ నిరాశే, నారి సారీ' వంటి శీర్షికలు పెట్టి మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రతిపక్షాలు అడ్డం కొట్టాయన్న అర్థం వచ్చే విధంగా రాసాయి. ఇది విషయాన్ని సరిగా అర్థం చేసుకోకపోవడం అయినా కావచ్చు లేదా ఎన్‌డిఎ ఎజెండాను ముందుకు తీసుకుపోయే క్రమంలో ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి శీర్షికలు పెట్టి ఉండవచ్చు. ప్రముఖ విప్లవకవి శివసాగర్ కవిత ఒకటి గుర్తొస్తున్నది. 'ఆకాశంలో సగం నువ్వు, అనంతకోటి నక్షత్రాల్లో సగం నువ్వు, సగం నేను' అంటాడాయన స్త్రీని ఉద్దేశించి. ఆకాశంలో సగం అయితే అయింది గాని స్త్రీ మన చట్టసభల్లో మాత్రం సగం కాదు. గణాంకాలు పరిశీలించినట్లయితే 18వ లోకసభలో మహిళల ప్రాతినిధ్యం 13.6% అంటే 74 మందే మహిళ ఎంపీలు. పార్లమెంటులో అది 15 శాతానికి మించడం లేదు. 147 కోట్ల జనాభా గలిగిన భారతదేశంలో 48% మహిళలు ఉన్నట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి. అదే నిష్పత్తిలో చట్టసభలలో వారికి ప్రాతినిధ్యం లేదు. 2023లో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన 33 శాతం రిజర్వేషన్లు కాకుండా జనాభా ప్రాతిపదికన వారికి 48 శాతం రిజర్వేషన్ కల్పించి, అది వెంటనే 2029లో జరగబోయే లోకసభ, దానికి ముందు వెనక జరిగే శాసనసభల ఎన్నికల్లో అమల్లోకి తీసుకురావాల్సిన బాధ్యత అన్ని రాజకీయపక్షాలది. ఒబిసిలు, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీల ప్రాతినిధ్యం విషయంలో ప్రతిపక్షాలు తెస్తున్న ప్రతిపాదనల్ని పట్టింపులకు పోకుండా చర్చించి ఆమోదిస్తేనే ప్రభుత్వపక్షం ఈ అంశంలో నిజాయితీగా వ్యవహరిస్తోందని అనుకోవచ్చు. మహిళా రిజర్వేషన్ల శాతం ఒకసారి నిర్ణయిస్తే నియోజకవర్గాల సంఖ్య పెంచినప్పుడల్లా అదే శాతం వారికి వర్తింపజేయవచ్చు. దీనికి ఇబ్బంది ఏమీ ఉండదు. ఇక డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు వెలిబుచ్చిన అభిప్రాయాలను సీరియస్‌గా పరిగణనలోకి తీసుకొని దక్షిణాదిపట్ల కేంద్రం వివక్ష చూపుతున్నదన్న అభిప్రాయం ప్రజల్లో పెరగకుండా చూడాలి. ఆంధ్రప్రదేశ్‌లో అధికార, విపక్షాలు రెండూ కేంద్రప్రభుత్వం తెచ్చిన సవరణకు మద్దతుగా నిలిచి మిగిలిన దక్షిణాది రాష్ట్రాల నుండి వేరుపడి విమర్శకు తావిచ్చాయి. మరిన్ని కనుగొనండి లైఫ్ స్టైల్ వార్తాపత్రిక ఇ-పేపర్ సబ్‌స్క్రిప్షన్ తాజా వార్తలు 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది కాబట్టి ఇక లోకసభ స్థానాలు 2026 సెన్సస్ (జనాభా లెక్కల) ప్రకారం జరుగుతాయి. అటువంటప్పుడు ఆంధ్రప్రదేశ్ 5, తెలంగాణ 3, తమిళనాడు 10, కర్ణాటక 2, కేరళ 7, ఒడిశా 4, పశ్చిమ బెంగాల్ 4 సీట్లు ప్రస్తుతం ఉన్నసంఖ్య కంటే తగ్గుతాయని, ఉత్తరప్రదేశ్‌కు, బీహార్‌కు 10, మధ్యప్రదేశ్‌కు 5, రాజస్థాన్‌కు 7 స్థానాలు పెరుగుతాయని బిల్లు వీగిపోయి 24 గంటలైనా గడవకముందే ఎన్‌డిఎ అభిమానులు ప్రచారం మొదలుపెట్టారు. దీనివల్ల బిజెపికే లాభం జరుగుతుందని చంకలు గుద్దుకుంటున్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం అన్నిపక్షాలను సమావేశపరిచి, వారితో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా నియోజకవర్గాల సంఖ్యను పెంచడం కానీ, వాటి పునర్విభజన జరపడం కానీ చేయకపోతే ముందుముందు దేశ సమగ్రతకు నష్టం జరుగుతుందన్న విషయం బాధ్యతగల రాజకీయ పక్షాలన్నీ గుర్తించాలి.

# ఇవేమి ఎండలు రా బాబు

విజయవాడ, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

వేసవి ఎండలు మండిపోతున్నాయి. సాధారణంకన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇక అర్బన్ హీట్ ఐలాండ్ తో నగరాలు నిప్పులు కొలిమిలా మారుతున్నాయి. ఎండలకు తోడుగా కాలుష్యం, కాంక్రీట్ జంగిల్స్ విడుదల చేస్తున్న కర్బన ఉద్గారాలతో నగరాల్లో రెండు మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయి. దీంతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. పగటిపూట ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఈ పరిస్థితులు అధిగమించి ప్రజలు సాధారణ జీవనం సాగించడానికి ఏపీ ప్రభుత్వం స్మార్ట్ ఆలోచన చేసింది. ఈ వేసవి ఆరంభం నుంచి రాష్ట్రంలో ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నంలో మిస్ట్ స్ప్రేయింగ్ మెషీన్లతో వాతావరణాన్ని చల్లబరిచే ప్రయోగం చేస్తున్నాయి. గత నెల రోజులుగా విజయవాడ, విశాఖపట్నంలో ముఖ్య కూడళ్లు, ప్రధాన రహదారులలో మిస్ట్ స్ప్రేయింగ్ మెషీన్లు దర్శనమిస్తున్నాయి. వీటి ద్వారా నగరాల్లోని బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్లు మరియు రద్దీగా ఉండే వీధుల్లో ఉష్ణోగ్రతను తగ్గించడానికి ఈ యంత్రాలను వాడుతున్నారు. ఇవి నీటిని చాలా సూక్ష్మమైన తుంపర్ల రూపంలో గాలిలోకి విడుదల చేస్తాయి. ఈ తుంపర్లు గాలిలోని వేడిని గ్రహించి ఆవిరైపోవడం ద్వారా చుట్టుపక్కల వాతావరణాన్ని తక్షణమే చల్లబరుస్తాయి. దీనివల్ల బాటసారులకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. అంతేకాకుండా ఎండ వేడి మూడు నుంచి ఐదు డిగ్రీల వరకు తగ్గుతోందని ప్రభుత్వం చెబుతోంది. మహిమ అద్భుతం ప్రభుత్వం వినూత్నంగా అమలు చేస్తున్న ఈ స్మార్ట్ టెక్నాలజీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రధానంగా 'ఆంధ్రా ఓవెన్'గా చెప్పే విజయవాడలో బాటసారులు కొత్త అనుభూతిని పొందుతున్నారని అంటున్నారు. విజయవాడలో వేసవి ఉష్ణోగ్రతలు సుమారు 44 డిగ్రీల సెల్సియస్ గా ఉంటాయి. కొన్నిసార్లు ఇవి మరో నాలుగు లేదా ఐదు డిగ్రీలు పెరుగుతుంటాయని నివేదికలు చెబుతున్నాయి. మే నెలలో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. దీంతో విజయవాడలో ఎండ తీవ్రత తగ్గించడానికి ప్రభుత్వం మిస్ట్ స్ప్రేయింగ్ మెషీన్లు అందుబాటులోకి తీసుకువచ్చిందని చెబుతున్నారు. మిస్ట్ స్ప్రేయింగ్ మెషీన్లు వెదజల్లే నీళ్లు రోడ్ల చుట్టుపక్కల వాతావరణాన్ని చల్లబరుస్తున్నాయి. వీటివల్ల రోడ్డు మధ్యలో ఉన్న మొక్కలు కూడా ఎండిపోకుండా పచ్చదనం పెరుగుతుందని అంటున్నారు. మరోవైపు ఈ ప్రక్రియ వల్ల కాలుష్యం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ, విశాఖపట్నంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఈ విధానం సత్ఫలితాలను ఇస్తే భవిష్యత్తులో తిరుపతి, రాజమండ్రి వంటి నగరాల్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని చెబుతున్నారు. ఇక సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉష్ణోగ్రతలను నిలువరించేందుకు కేంద్రీకృత వ్యవస్థ తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

మరో 2 రోజులు ఇంతేనా

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని, ఇవి రాబోయే రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వేడిమి ఉంటుందన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. ఏపీఎస్‌డీఎంఏ ప్రకారం.. తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు నుండి మన్నార్ గల్ఫ్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తోంది. దీని ఫలితంగా మన్యం, అల్లూరి, పోలవరం, ఏలూరు జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో ఉరుములతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. కడప జిల్లాలోని ఒంటిమిట్టలో 45 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 244 మండలాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కూడా కురిశాయి. ఆదివారం పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లోని 27 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు ఉండే అవకాశం ఉంది. విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 25 మండలాల్లో కూడా వేడిగాలులు వీచే అవకాశం ఉంది. నమోదైన ఇతర గరిష్ట ఉష్ణోగ్రతలలో కర్నూలు జిల్లాలోని గూడూరులో 44.3 డిగ్రీలు, అనంతపురంలోని తేరన్నపల్లిలో 44.1 డిగ్రీలు, తిరుపతి జిల్లాలోని వరదయ్యపాలెంలో 43.5 డిగ్రీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ 25 వరకు వడగాలులతో కూడిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలోని అక్కడక్కడా ఉరుములతో కూడిన మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉంది. అదే సమయంలో రాయలసీమలోని అక్కడక్కడా వడగాలులు కొనసాగే అవకాశం ఉండగా, కోస్తా ఆంధ్రప్రదేశ్ మరియు యానాంలోని అక్కడక్కడా వేడి, తేమతో కూడిన వాతావరణం నెలకొనే అవకాశం ఉంది. ఈ వాతావరణ పరిస్థితులు ఏప్రిల్ 25 వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ బులెటిన్ తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ అంచనా వేశారు. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వేడి కొనసాగగా, మరికొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# స్లీపర్ బస్సుల నిషేధం

## ప్రభుత్వానికి నివేదిక

విజయవాడ, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

ప్రైవేటు స్లీపర్ బస్సులు వరుసగా తీవ్ర ప్రమాదాలకు గురవుతున్న విషయం తెలిసిందే. నేపథ్యంలో ఈ ప్రమాదాల వెనుక గల కారణాలపై విచారణ జరపాలని, ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి అవసరమైన చర్యలపై సిఫార్సులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు.. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సమగ్ర దర్యాప్తు జరిపి, స్లీపర్ బస్సులను దశలవారీగా పూర్తిగా నిషేధించాలని సిఫార్సు చేసన్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించింది. రాష్ట్రంలో స్లీపర్ బస్సులపై నిషేధం విధించే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని ఇప్పటికే రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కూడా పేర్కొన్నారు. నివేదిక ప్రకారం.. వరుస ఘోర ప్రమాదాల నేపథ్యంలో స్లీపర్ బస్సులపై దశలవారీ నిషేధాన్ని విధించాలని ఏఎస్‌సీఐ సిఫార్సు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన ఈ నివేదిక, తీవ్రమైన భద్రతాపరమైన ఆందోళనలను ఎత్తి చూపుతోంది. 22 నెలల్లోగా స్లీపర్ బస్సు సర్వీసులను పూర్తిగా తొలగించాలని పిలుపునిచ్చింది. ఈ అధ్యయనం అంతర్జాతీయ పద్ధతులతో పోలికలు చేసింది. చైనా 2012లో స్లీపర్ బస్సులను నిషేధించగా, అనేక ఐరోపా దేశాలు వాటిలో అంతర్లీనంగా ఉన్న భద్రతా ప్రమాదాల కారణంగా 2004లోనే ఇలాంటి నిషేధాలను అమలు చేశాయని పేర్కొంది. ఏఎస్‌సీఐ పరిశోధనలు స్లీపర్ బస్సులలోని కీలకమైన డిజైన్ లోపాలను స్పష్టం చేస్తున్నాయి. వాటిలో కింద, పైన బెర్త్‌లు ఉండటం కూడా సరిగా లేదని స్పష్టం చేసింది. బస్సు బోల్తా పడే ప్రమాదం పెరగడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా ప్రయాణికులను ఖాళీ చేయించడానికి ఇబ్బంది అవుతుంది. స్లీపర్ బస్సులో ఉన్న బెర్త్‌ల మధ్య ఒకరే ఇబ్బందిగా నడవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఏదైనా ప్రమాదం జరిగితే.. వెంట వెంటనే అందరూ బయటకు రాలేకపోతున్నారు. గందరగోళం నెలకొని మృతుల సంఖ్య మరింత పెరుగుతోంది. కర్నూలు జిల్లా చిన్నటేకూరు నాయకల్లు ఫ్లైఓవర్ సమీపంలో ప్రమాదంపై జరిపిన దర్యాప్తులో తీవ్రమైన లోపాలు బయటపడ్డాయి. ప్రమాదానికి గురైన బస్సును మోటార్ వెహికల్స్ చట్టం కింద అనుమతి లేకుండా, 53 సీట్ల బస్సు నుండి 43 బెర్త్‌ల స్లీపర్‌గా అక్రమంగా మార్చారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలను మూసేశారు. డ్రైవర్ డోర్‌కు శాశ్వతంగా బోల్టు వేశారు. లోపల అగ్ని నిరోధకత లేని పదార్థాలను ఉపయోగించారు. ఆ వాహనంలో ఎల్‌పీజీ సిలిండర్, లిథియం-అయాన్ బ్యాటరీలతో సహా ప్రమాదకరమైన వస్తువులు ఉన్నట్లు కూడా దర్యాప్తు అధికారులు కనుగొన్నారని నివేదిక పేర్కొంది. చట్టవిరుద్ధమైన మార్పులు చేసినప్పటికీ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జారీ చేయడం, వాహన్ డేటాబేస్‌లోని రిజిస్ట్రేషన్ రికార్డులలో వ్యత్యాసాలు ఉండటం వంటి అమలు వైఫల్యాలను కూడా ఈ నివేదిక బయటపెట్టింది. ఒడిశాలో రిజిస్టర్ అయిన ఆ బస్సు, పర్మిట్ నిబంధనలను దుర్వినియోగం చేస్తూ, సరిగా లేకుండా అంతర్రాష్ట్ర మార్గాల్లో నడుస్తోంది. మరోవైపు రెట్రోఫిట్ వర్క్‌షాప్‌లు సరైన పర్యవేక్షణ లేకుండా పనిచేస్తున్నాయని కూడా నివేదిక పేర్కొంది

నాలుగు దశల ప్రతిపాదనలు

మొదటి దశ ప్రకారం స్లీపర్ బస్సుల తయారీ, మార్పిడిని తక్షణమే నిలిపివేయాలి.

రెండో దశలో ప్రస్తుతం ఉన్న స్లీపర్ బస్సుల స్థానంలో 18-24 నెలల వ్యవధిలో సురక్షితమైన సీటర్ బస్సులను క్రమంగా ప్రవేశపెట్టాలి.

మూడో దశ హై-స్పీడ్ రైలు కారిడార్లు, తక్కువ ఖర్చుతో కూడిన విమానయానంతో సహా ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థలను విస్తరించడంపై దృష్టి పెట్టాలి.

చివరి దశ ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్, అంతర్-రాష్ట్ర సమన్వయం, ఉల్లంఘనలకు రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు భారీ జరిమానాల విధించాలి.

# అరటికి ఏమైంది

రాజమండ్రి, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

పశ్చిమ ఆసియాలో ఎగుమతులపై నెలకొన్న ఉద్రిక్తతలు, మధ్యవర్తుల జోక్యం, ఏకకాలంలో పంట కోత, అస్తవ్యస్త వాతావరణ పరిస్థితులు వంటి ప్రపంచ, స్థానిక కారణాలతో అరటి రైతులు నష్టపోతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో టన్నుకు రూ. 18,000 నుంచి రూ. 27,000 మధ్య ధరలు పలికినప్పటికీ.. ఎగుమతి డిమాండ్ తగ్గడంతో మార్చి నుంచి ధరలు తీవ్రంగా పడిపోయాయి. ఒక దశలో, ధరలు టన్నుకు రూ. 6,000-రూ. 9,000 కు పడిపోయాయి. తర్వాత ధరలు సుమారు రూ. 10,000 - రూ. 11,000 వరకు స్వల్పంగా కోలుకున్నప్పటికీ రైతులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోంది. అరటి సాగులో పులివెందుల ప్రాంతం ఎక్కువ వాటాను కలిగి ఉంది. దాదాపు 25,000 ఎకరాలలో విస్తరించి ఉంది. ఇతర ప్రాంతాలలో 8 నుండి 10 రోజులతో పోలిస్తే.. ఈ ప్రాంతపు అరటిపండ్లు వాటి నాణ్యతకు పెట్టింది పేరు. 12 నుండి 14 రోజుల పాటు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. ఇక్కడ నుంచి సగటున ప్రతిరోజూ 1,000 టన్నులకు పైగా అరటిపండ్లు ఢిల్లీ, కోల్‌కతా, శ్రీనగర్ వంటి నగరాలకు, అలాగే హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలకు రవాణా అవుతున్నాయి. అరబ్ దేశాలకు కూడా ఎగుమతులు జరుగుతాయి. ప్రతిరోజూ 10 నుండి 16 ట్రక్కుల లోడ్లు వెళ్తాయి. ప్రతి ట్రక్కు 20 నుండి 25 టన్నుల సరుకును తీసుకువెళుతుంది. ఇది ముంబై ఓడరేవులకు చేరడానికి ముందు అనంతపురం జిల్లాలోని తాడిపత్రి రైల్వే స్టేషన్ మీదుగా వెళుతుంది. ఉత్పత్తి బాగా ఉన్నా.. అధిక రవాణా ఖర్చులు లాభాలను తగ్గిస్తున్నాయి. రైతులు 20 టన్నుల రవాణాకు రూ. 80,000 నుండి రూ. 1.1 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. అంటే కిలోకు రూ. 6-8 చొప్పున ఖర్చవుతోంది. దీనితో పోలిస్తే, మహారాష్ట్ర రైతులకు కిలోకు కేవలం రూ. 2-3 మాత్రమే ఖర్చవుతోంది. మహారాష్ట్ర నుండి ముందుగానే అరటి రావడం కడప ఉత్పత్తులకు డిమాండ్‌ను మరింత బలహీనపరిచింది. కొనుగోలుదారులు లేకపోవడం వల్ల పెద్ద మొత్తంలో పంట అమ్ముడుపోకుండా పొలాల్లోనే కుళ్లిపోతోందని రైతులు అంటున్నారు. ఎకరానికి సాగు ఖర్చులు రూ. 1.5 లక్షలకు చేరుకుంటుండగా, 15-20 టన్నుల దిగుబడిని ఆశిస్తున్న తరుణంలో ప్రస్తుత ధరలతో నష్టాలో ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఎగుమతులకు అంతరాయం కలగడం, మహారాష్ట్రలో ఉత్పత్తి పెరగడం అనే రెండు కారణాల వల్ల ధరలు తగ్గాయని అధికారులు చెబుతున్నారు. డిమాండ్ పెరగడంతో ధరలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, రైతులు మాత్రం ఇంకా అనుమానంగానే ఉన్నారు. ధరలను తగ్గించడానికి మధ్యవర్తులు అంతర్జాతీయ అంశాలను సాకుగా చూపుతున్నట్టుగా చెబుతున్నారు.

# నియోజకవర్గాలు పెరుగుతాయా...

ఒంగోలు, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

ఆంధ్రప్రదేశ్ లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందా? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం ఈ సారి అయినా నెరవేరుస్తుందా? 2029 ఎన్నికల నాటికి ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెరుగుదల పై అనుమానాలు కలుగుతున్నాయి. ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్లు నియోజకవర్గాల సంఖ్య పెంచాల్సి ఉంది. అయితే రాష్ట్ర విభజన జరిగి పదేళ్లకు పైగానే గడిచినా, మూడు ఎన్నికలు ముగిసినా ఇంత వరకూ నియోజకవర్గాలను పెంచలేదు. మరొకవైపు పార్లమెంటులో డీ లిమిటేషన్ బిల్లు వీగిపోవడంతో దీనిపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. మూడు పార్టీల కూటమిగా ఉండటం, ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో నియోజకవర్గాల సంఖ్య పెరిగితే తాము పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి టిక్కెట్లు కేటాయించే వీలుంటుంది. ఏపీలో శాసనసభ స్థానాలు 225కి, తెలంగాణలో 134కి పెరగాల్సి ఉంది. అయితే తాజాగా డీ లిమిటేషన్ బిల్లు వీగిపోవడంతో ఏపీ, తెలంగాణలోనూ సీట్ల సంఖ్య 2029 ఎన్నికల నాటికి పెరుగుతాయా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణాలు కూడా లేకపోలేదు. ఎందుకంటే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. దేశం మొత్తంలో నియోజకవర్గాల సంఖ్య పెంచితే ఓకే. కానీ ఏపీ, తెలంగాణలలో మాత్రమే పెంచాలంటే కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా ఆలోచిస్తుందన్న టాక్ ఏపీ రాజకీయ నేతలను భయపెడుతుంది. జనగణన పూర్తయిన తర్వాత నియోజకవర్గాల సంఖ్య పెరుగుతాయన్న ఆశ ఉన్నప్పటికీ తెలంగాణలో నియోజకవర్గాలు పెంచితే కాంగ్రెస్ ప్రయోజనం పొందుతుందని భావించి మళ్లీ వాయిదా పడుతుందేమోనన్న అనుమానాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. కానీ దేశంలో జరిగే డీ లిమిటేషన్ కు, ఏపీ, తెలంగాణ నియోజకవర్గాల పెంపునకు సంబంధం లేదని ఎవరికి వారే సర్ది చెప్పుకుంటున్నా ఏదో తెలియని భయం మాత్రం ఏపీ నేతలను వెంటాడుతుంది.

# రాజ్యసభకు యనమల

కాకినాడ, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20



టీడీపీలో సీనియర్ లీడర్ గా యనమల రామక్రిష్ణుడు ఉన్నారు. ఆయన 1983 నుంచి గెలుస్తూ వచ్చారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టక టికెట్ అందుకుని ఎమ్మెల్యేగా తొలిసారి చట్టసభలో అడుగుపెట్టిన యువ నేతలలో యనమల రామక్రిష్ణుడు ఒకరు. ఆయన ఏకంగా ఆరు సార్లు తుని నుంచి గెలిచారు. రెండు సార్లు ఎమ్మెల్సీగా పన్నెండేళ్ళ పాటు ఉన్నారు. సుదీర్ఘ కాలం మంత్రిగా ఆర్థిక మంత్రిత్వ శాఖను చూశారు. ఇక యనమల కోరిక ఒకటి మాత్రం ఇంతటి సుదీర్ఘ రాజకీయ జీవితంలో తీరలేదు అదే రాజ్యసభ సభ్యత్వం. ఆయన ఎంపీగా నెగ్గి పార్లమెంట్ లో తన గళం వినిపించాలని అనుకుంటున్నారు. ఆ కోరిక కూడా 2014 నాటిది. కానీ ఆయన సేవలు రాష్ట్రానికి అవసరం అని చెబుతూ పార్టీ ఎమ్మెల్సీగానే చాన్స్ ఇస్తూ పోయింది.ఇదిలా ఉంటే టీడీపీలో ఇపుడు యనమలకు పూర్వపు ప్రాధాన్యత లేదని ఆయన పూర్తిగా రాజకీయాల నుంచి రిటైర్ కావాల్సిందే అన్న ప్రచారం సాగింది. కానీ అవన్నీ ఒట్టి మాటలే అని తేలిపోయింది. యనమలను టీడీపీ పొలిట్ బ్యూరోలో కొనసాగించారు తాజాగా విడుదల చేసిన జాబితా చూస్తే కనుక అందులో అనేక మంది సీనియర్ నేతల పేర్లు లేకుండా పోయాయి. కానీ యనమలకు మాత్రం కీలక స్థానం అలాగే ఉంచేశారు. దాంతో టీడీపీలో యనమల సీనియారిటీకి తగిన గౌరవం దక్కుతోందని ఆయన వర్గం ఆనందంగా ఉంది.ఇక యనమల విషయంలో టీడీపీ అధినాయకత్వం ఎంతో గౌరవ పూర్వకంగా వ్యవహరిస్తూ వస్తోంది. దాంతో యనమలకు పార్టీ పదవులతో పాటుగా రాజ్యసభ సభ్యత్వం కూడా దక్కుతుందా అన్న చర్చ మొదలైంది. ఏపీ నుంచి జూన్ లో ఖాళీ అయ్యే నాలుగు సీట్లలో టీడీపీకి రెండు దక్కుతాయి. అందులో ఒకటి సానా సతీష్ కి ఇస్తారు అన్నది అంతా అనుకుంటున్నదే. అయితే ఆ రెండవ సీటు యనమలకే రిజర్వ్ చేశారా అన్న చర్చ సాగుతోంది.అయితే ఇదే సీటు విషయంలో ఎంతో మంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు. కానీ బీసీ సామాజిక వర్గంలో పెద్ద దిక్కుగా బాబుతో సమానంగా సీనియర్ గా ఆయన సమకాలికునిగా ఉన్న యనమలకు ఈ సీటు ఇస్తే పార్టీలో ఎవరూ పోటీ పడరని ఆలోచిస్తున్నారు. అంతే కాదు యనమల సేవలను జాతీయ స్థాయిలో కూడా వినియోగించుకోవాలని టీడీపీ చూస్తోంది అని అంటున్నారు. యనమల పొలిట్ బ్యూరోలో కొనసాగడం వెనక కూడా పార్టీ పెద్దల ఆలోచనలు ఉన్నాయని అంటున్నారు. రేపటి రోజున లోకేష్ పార్టీని లీడ్ చేసినా యనమల వంటి వారు తమ అనుభవంతో తగిన సూచనలు సలహాలు ఇచ్చే విధంగా ఉంటుందనే ఇలా చేశారు అని అంటున్నారు. అదే విధంగా రాజ్యసభలో కూడా సీనియర్ నేతల అవసరం ఉందని అది యనమలతో భర్తీ చేస్తారు అని అంటున్నారు. మొత్తానికి యనమలకు పొలిట్ బ్యూరో నుంచి నేరుగా ఢిల్లీలో పార్లమెంట్ కి దారులు తెరిచారు అని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజమెంత ఉందో.

# మరో రెండు కొత్త రైల్వే లైన్లు

విశాఖపట్నం, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

ఏపీకి కేంద్రం మరో తీపికబురు వినిపించింది. రాష్ట్రంలో కొత్త మరో రెండు రైల్వే లైన్లు ఏర్పాటు చేయనుంది. రాజమండ్రి - విశాఖపట్నం మార్గంలో నిడదవోలు - దువ్వాడ మధ్య రెండు రైల్వే లైన్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.9889 కోట్లతో 198 కోట్ల మేరకు రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో అనుసంధానం పెరగటంతో పాటుగా ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడుతుందని ట్వీట్ చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఏపీకి కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. రాజమండ్రి-విశాఖపట్నం మధ్యన రైల్వే లైన్ల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజమండ్రి - విశాఖపట్నం మధ్య రూ.9,889 కోట్లతో 198 కిలోమీటర్ల మేరకు మరో రెండు రైల్వే లైన్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ శనివారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిడదవోలు-దువ్వాడ రైల్వే స్టేషన్లను కలుపుతూ రైల్వే లైన్లు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాల మీదుగా ఈ రైల్వే ప్రాజెక్టు రానుంది.మరోవైపు కేంద్రం తీసుకున్న నిర్ణయంతో పలు పోర్టులకు కూడా అనుసంధానం పెరగనుంది. కాకినాడ, మచిలీపట్నం, గంగవరం, విశాఖపట్నం పోర్టులకు అనుసంధానం పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. చెన్నై- హౌడా సెక్షన్ లో ఈ రైల్వే ప్రాజెక్టు చేపడుతున్నారు. రద్దీ కారణంగా ఈ మార్గంలో ఆలస్యం జరుగుతోందని భావించిన కేంద్ర ప్రభుత్వం.. రైల్వే లైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇక ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నది మీద మూడు బైపాస్‌లు, 4.3 కిలోమీటర్ల పొడవైన రైల్వే బ్రిడ్జి, 2.67కి.మీ వయాడక్ట్ నిర్మించనున్నారు. మరోవైపు కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. " ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ.. రాజమండ్రి (నిడదవోలు) ? విశాఖపట్నం (దువ్వాడ) మూడు, నాలుగో లైన్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను." అంటూ ట్వీట్ చేశారు.గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల రైలు వంతెనతో కూడిన ఈ ప్రాజెక్టు ద్వారా.. రద్దీని గణనీయంగా తగ్గుతుందని, ప్రయాణ సమయాన్ని మెరుగుపరుస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో అనుసంధానాన్ని మెరుగుపడుతుందని, ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. సరుకు రవాణాను పెంచటంతో పాటుగా పారిశ్రామిక వృద్ధికి, ఓడరేవుల ఆధారిత అభివృద్ధికి తోడ్పడుతుందని.. అన్నవరం, అంతర్వేది , ద్రాక్షారామం వంటి ఆధ్యాత్మిక ప్రాంతాలకు వెళ్లే భక్తులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ దిశగా మరో ముందడుగుగా అభివర్ణిస్తూ చంద్రబాబు ట్వీట్ చేశారు.



## వ్యక్తిపై హత్యాయత్నం

అత్తాపూర్ భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సులేమాన్ నగర్ లో హత్యాయత్నం జరిగింది. ఫర్నిచర్ షాప్ లో పనిచేస్తున్న రెహాన్ అనే వ్యక్తిని వదుకున్న నమయంలో మరో వ్యక్తి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. కత్తితో దాడి చేస్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ రెహాన్ ని స్థానిక ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు....

## అక్రమ గ్యాస్ రిఫిల్లింగ్ యూనిట్ సీజ్

హైదరాబాద్ ఏప్రిల్ 20

హైదరాబాద్ కమిషనరేట్ పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో విశ్వసనీయ సమాచార మేరకు పహాడి షరీఫ్ పోలీసులు వినాయక కిరాణా జనరల్ స్టోర్ లో అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్ లో నుంచి చిన్న సిలిండర్లలో రీఫిల్ చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి షాప్ నిర్వాహకుడు ఏపూరి రాజశేఖర్ 55 ను మరియు ఒక గ్యాస్ సిలిండర్, మూడు చిన్న సిలిండర్లు మరియు వేయింగ్ మిషన్లు సీజ్ చేసిన పోలీసులు, షాప్ యజమాని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

======================

## డబ్బున్నవారి మైనర్ బాలికలే టార్గెట్

హైదరాబాద్ భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

జూబ్లీహిల్స్ లో ఇన్‌స్టాగ్రామ్ చీటర్ అరెస్ట్ అయ్యాడు. ఈ ముఠా ఇన్‌స్టాగ్రామ్ లో డబ్బున్న మైనర్ అమ్మాయిలని ట్రాప్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. విదేశాల్లో ఉంటున్న తల్లిదండ్రుల వారి పిల్లలే ట్రాప్ చేస్తోంది. ప్రముఖ స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థులని టార్గెట్గా ట్రాప్ చేస్తారు. ఇన్‌స్టాగ్రామ్ లో ప్రముఖ పబ్బులలో తిరిగినట్లు పోస్టులు పెడుతుంది. పారిశ్రామికవేత్త పిల్లలని ట్రాప్ చేసి డబ్బులు గుంజుతుంది. మైనర్ ఆడపిల్లలను ట్రాప్ చేసి వీడియోలు ఫోటోలు తీస్తుంది. వీడియో ఫోటోలు అడ్డం పెట్టుకొని లక్షల రూపాయలు వసూలు చేస్తుంది. ముఠాలోని కీలక సభ్యుని షీ టీమ్స్ అరెస్టు చేసింది.ప్రముఖ పారిశ్రామికవేత్త కూతుర్ని ట్రాప్ చేసి లక్షలు వసూలు చేసింది ముఠా. పారిశ్రామికవేత్త ఇంట్లో పని చేసే పని వాళ్ళని సైతం ట్రాప్ చేసింది. పని వాళ్ళ ద్వారా మైనర్ అమ్మాయి కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంది. ప్రముఖ స్కూల్లో చదువుకుంటున్న అమ్మాయిని ట్రాప్ చేసి డబ్బులు కొట్టేసింది. ముఠా నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్ కెరాఫ్ అర్జున్,ని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## అర్ధరాత్రి రైలులో దారిదోపిడి

బాపట్ల ఏప్రిల్ 20 ఆదివారం అర్ధరాత్రి బెంగుళూరు-నరసాపురం (07154) స్పెషల్ ఎక్స్ప్రెస్ రైలులో.. 4 కోచ్లలో దోపిడీ దొంగలు హల్ చల్ చేసారు. ప్రయాణికులను కత్తులతో బెదిరించి బంగారం ఎత్తుకెళ్లారు. ప్రధానంగా నా7, నా11, నా12, నా13 కోచ్లలో ప్రయాణికుల నుంచి సుమారు 11 తులాలు బంగారం ఎత్తుకెళ్లారు. అప్పికట్లలో రైలును ఆపి సుమారు పది మంది దుండగులు దిగి పారిపోయారు. రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తిరువూరు, సత్యవేడు... రిజర్వుడు నియోజకవర్గాల్లో అంత....

తిరుపతి భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

తెలుగుదేశం పార్టీ షెడ్యూల్ కులాల నియోజకవర్గాల నేతల్లో అసంతృప్తి నెలకొంది. అనేక నియోజకవర్గాల్లో నేతలు టీడీపీలో తాము లాభం పొందలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. తిరువూరుతో పాటు తాజాగా సత్యవేడు నియోజకవర్గం నేతలు కూడా బాహాటంగా బయటపడటం ఒకింత పార్టీకి ఇబ్బందికరంగా మారింది. నేతలను కట్టడి చేయాల్సిన నాయకత్వం అక్కడ మరొకరిని ఇన్ ఛార్జిగా పెట్టి ప్రోత్సహిస్తుండటం, వారే నియోజకవర్గంపై పెత్తనం చేస్తుండటంతో నేతలు తిరగబడుతున్నారు.తిరువూరు నియోజకవర్గంలో ఏదైతే జరిగిందో సత్యవేడులోనూ అదే జరిగింది. తిరువూరులో కొలికపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అక్కడ పెత్తనమంతా ఎంపీ కేశినేని చిన్నిదంటూ ఆయనే నేరుగా ఆరోపణలు చేశారు. మద్యం, ఇసుక వంటి దందాలను సాగిస్తున్నారని అన్నారు. తాను టిక్కెట్ కోసం యాభై కోట్లు ఇచ్చానని కొలికపూడి గతంలో ఆరోపించారు. తాజాగా సత్యవేడు నియోజకవర్గంలో ఆదిమూలం కుమారుడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తమకు వంద కోట్లు ఇస్తే నియోజకవర్గం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తామని ప్రకటించారు.నిజంగా మొన్నటి ఎన్నికల్లో వంద కోట్ల రూపాయలు ఆదిమూలం ఖర్చు చేశారా? ఎన్నికల కోసమే ఖర్చు పెట్టారా? మరెవరికైనా నిధులు ఇచ్చారా? అని సోషల్ మీడియాలో ట్రోల్ అవుతుంది.

ఒక్క సత్యవేడు నియోజవర్గం ఆదిమూలం వంద కోట్లు ఖర్చు పెట్టారంటే మిగిలిన నియోజకవర్గాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో తాము అప్పులు తెచ్చి మరీ ఈ వంద కోట్లు ఖర్చు పెట్టామని, ఇప్పుడు తమను పక్కన పెట్టి ఇన్ ఛార్జి ఇసుక, మద్యం దందాలను నిర్వహిస్తున్నారని, తమ పరిస్థితి ఏంటన్న ఆయన ప్రశ్నకు సమాధానం మాత్రం దొరకడం లేదు. మొత్తం మీద సత్యవేడు నియోజకవర్గంలో వంద కోట్లు వ్యయం చేశారన్న ఆదిమూలం కుమారుడు వ్యాఖ్యలు పార్టీని కుదిపేస్తున్నాయి.

==================

# ఢిల్లీలో రూ.5కే అటల్ క్యాంటిన్లలలో భోజనం

న్యూఢిల్లీ, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

ఢిల్లీలో పేదల కడుపు నింపేందుకు బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అటల్ క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించుకుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఈ పథకాన్ని 2025 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసంలో అధికారికంగా ప్రకటించారు. అటల్ క్యాంటీన్లు ఢిల్లీలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా కార్మికులు, రోజువారీ కూలీలు, నిరుపేదలకు నివాసులకు రూ. 5కి పోషకాహారం అందించే ఉద్దేశంతో ప్రారంభిస్తున్నారు. సబ్సిడీ ఆహార క్యాంటీన్లు మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మ శతజయంతి సందర్భంగా ఆయన పేరిట ప్రారంభిస్తారు. ఈ పథకం తమిళనాడులోని అమ్మ క్యాంటీన్లు, కర్ణాటకలోని ఇందిరా క్యాంటీన్లు, ఆంధ్రప్రదేశ్‌లోని అన్న క్యాంటీన్ల తరహాలో ఉంటాయి. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఈ క్యాంటీన్ల స్థాపన కోసం రూ. 100 కోట్లు కేటాయించారు. మొదటి దశలో ఢిల్లీలోని స్లమ్ క్లస్టర్లు, నిర్మాణ స్థలాల సమీపంలో 100 అటల్ క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్యాంటీన్లు ప్రధానంగా స్లమ్ నివాసులు, రోజువారీ కూలీలు, విద్యార్థుల వంటి ఆర్థికంగా ఇబ్బంది పడే వారికి సరసమైన ఆహారాన్ని అందించే చోట ఏర్పాటు చేస్తారు. ఒక్కో భోజనం ధర కేవలం రూ. 5గా నిర్ణయించారు. క్యాంటీన్ ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించారు. తమిళనాడులోని అమ్మ క్యాంటీన్లు, కర్ణాటకలోని ఇందిరా క్యాంటీన్లు, ఏపీలో అన్న క్యాంటీన్ల తరహాలో నిర్వహిస్తారు. తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు ఒక్కు ఇడ్లీ రూ. 1, కర్డ్ రైస్ రూ. 3, సాంబార్ రైస్ రూ. 5 వంటి ధరలతో అత్యంత ప్రజాదరణ పొందాయి. ఈ క్యాంటీన్లలో స్వయం సహాయక బృందాల మహిళలు ఆహారాన్ని వండి, వడ్డిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్న క్యాంటీన్లు రూ. 5కు రోజుకు మూడు పూటలా భోజనం, యు కర్ణాటకలో ఇందిరా క్యాంటీన్లు రూ. 5కు అల్పాహారం, రూ. 10కు భోజనం కూడా ఇదే తరహాలో విజయవంతంగా నడుస్తున్నాయి. హర్యానాలో అటల్ కిసాన్ మజ్దూర్ క్యాంటీన్లు కూడా రూ. 10కు ఆహారాన్ని అందిస్తున్నాయి ఈ క్యాంటీన్లు ప్రధానంగా నిరుపేదలు , రోజువారీ కూలీలు, నిర్మాణ కార్మికులు, ఆర్థికంగా ఇబ్బంది పడే విద్యార్థుల ఆకలి తీరుస్తున్నాయి. అటల్ క్యాంటీన్లతో పాటు, రేఖా గుప్తా స్లమ్ నివాసులకు పక్కా ఇళ్లు, గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ బోర్డు, యమునా నది శుద్ధీకరణ, ఢిల్లీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రణాళికలను ప్రకటించారు.

## అపార్ట్ మెంట్ లో అగ్ని ప్రమాదం ఇద్దరికి తీవ్ర అస్వస్థత

హైదరాబాద్ భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని టీఎన్జీవో కాలనీలోని ఒక అపార్ట్మెంట్ లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దట్టమైన పొగ అలుముకోవడంతో ఊపిరి అడక అపార్ట్మెంట్ వాసులు ఇబ్బంది పడ్డారు. అపార్ట్మెంట్ లో ఉంటున్న ఇద్దరికి తీవ్ర అస్వస్థత కలిగింది. అపార్ట్మెంట్స్ లో పై అంతస్తులో చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. బిల్డింగ్ సెల్లార్ లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఘటనలో అపార్ట్మెంట్ లోని 15 ద్విచక్ర వాహనాలు దగ్ధం అయయాయి. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, మంటలను అదుపు చేసారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

## వివాదంలో లెన్స్ కార్ట్

ముంబై, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

భారత్‌లో ప్రతి చోట కనిపించే ఐవేర్ రిటైలర్ సంస్థ లెన్స్‌కార్ట్ వివాదాల సుడిలో చిక్కుకుంది. ఆ సంస్థలో పని చేసే ఉద్యోగులకు ఇచ్చిన డ్రెస్ కోడ్ రూల్స్ ఇప్పుడు సంచలనంగా మారుతున్నాయి. దీనికి సంబంధించిన స్క్రీన్ చూసిన నెటిజన్లు ఒక్కసారిగా ఫైర్ అవుతున్నారు. సంస్థ వ్యవస్థాపకుడు పీయూష్ బన్సాల్‌ను టార్గెట్ చేస్తూ ప్రశ్నిస్తున్నారు. మత పరమైన విషయాల పట్ల వివక్ష చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం ప్రధానంగా ఎక్స్ వేదికగా వెలుగులోకి వచ్చింది. ప్రముఖ సోషల్ మీడియా వినియోగదారు షెఫాలీ వైద్య, లెన్స్ కార్ట్ అంతర్గత స్టైల్ గైడ్ అని పేర్కొంటూ ఒక ఫోటో షేర్ చేశారు. అందులో 11వ పేజీలో ఉన్న రూల్స్ ప్రకారం కంపెనీ ఉద్యోగులు హిజాబ్ ధరించడానికి అనుమతి ఇచ్చారు. కానీ బొట్టు, తిలకం, కంకణం పెట్టుకునేందుకు మాత్రం అనుమతి లేదని తెలిపారు. దీనిపై ఆంక్షలు పెట్టడం కనిపించింది. హిందూ మెజారిటీ ఉన్న దేశంలో మెజార్టీ ఉద్యోగులు, వినియోగదారులు హిందువులే అయినప్పటికీ, పీయూష్ బన్సాల్ తన ఉద్యోగులకు హిజాబ్ పర్వాలేదు, కానీ బొట్టు, తిలకం పెట్టుకోకూడదని చెబుతున్నారు" అని షెఫాలీ వైద్య చేసిన పోస్ట్ వైరల్ అయ్యింది. ఈ వైరల్ పోస్టపై స్పందిస్తూ చాలా మంది వినియోగదారులు లెన్స్ కార్ట్ తీరును తప్పుపట్టారు. మతపరమైన చిహ్నాల విషయంలో ఒకే సంస్థలో రెండు రకాల రూల్స్ ఉండటం డబుల్ స్టాండర్డ్స్ అని విమర్శిస్తున్నారు. హిందూ ఉద్యోగులకు కుంకుమ, బొట్టు పెట్టుకునే హక్కు నిరాకరిస్తూ హిజాబ్‌ను అనుమించడం ఏంటని ఇది వివక్ష కాదా అని ప్రశ్నిస్తున్నారు. మరికొందరు వినియోగదారులు ఈ నిబంధనలు అన్యాయమైనవని అభివర్ణించారు. కొంతమంది లెన్స్‌కార్ట్ ఉత్పత్తులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఇంత వివాదం తర్వాత కూడా పాలసీ ఏమైనా మార్పు అని మరికొందరు నిలదీస్తున్నారు. ఇలాంటి వివక్షపూరితమైన నిబంధనలు అసలు ఎందుకు ఉన్నాయో కంపెనీ సమాధానం చెప్పాలి అని మరికొందరు డిమాండ్ చేస్తున్నారు. వివాదం ముదురుతున్న వేళ లెన్స్‌కార్ట్ వ్యవస్థాపకుడు పీయూష్ బన్సాల్ రంగంలోకి దిగారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, వైరల్ అవుతున్న డాక్యుమెంట్ ఇప్పుడు తమ సంస్థలో ఉన్న రూల్స్‌ది కాదని చెప్పారు. తప్పుదారి పట్టించేలా ఉందన్నారు. తమ కంపెనీలో బొట్టు , తిలకంపై ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. ఎప్పటికప్పుడు కంపెనీరూల్స్ మారుతుంటాయని వివరించారు. ఈ గందరగోళం వల్ల కలిగిన అలజడికి ఆయన క్షమాపణలు చెప్పారు. ఏమైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుంటామన్నారు.

## కొనసాగుతున్న కొండపల్లి ఉత్సవాలు

కొండపల్లి భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20కొండపల్లి బొమ్మల వందంగ ఉత్సవాలు రెండోరోజు సందడిగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, సాంస్కృతిక మరియు సృజనాత్మక శాఖ చైర్మన్ తేజస్విని పొడపాటి పాల్గొని ఉత్సవాలను సందర్శించారు. కళాకారులతో కలిసి ప్రత్యేకంగా నిర్వహించిన కొండపల్లి కార్నివాల్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఈ వందంగను మరింత వైభవంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కొండపల్లి బొమ్మల వందంగకు విశేష స్పందన లభిస్తోందని, దీన్ని ప్రపంచ వారసత్వ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు

# తెలంగాణ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు మే నెలలో పోలింగ్

హైదరాబాద్, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నగారా మోగడానికి సమయం ఆసన్నమైంది. గత కొంతకాలంగా ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న మండల, జిల్లా పరిషత్‌లకు తిరిగి ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం వేగంగా అడుగులు వేస్తోంది. పరిస్థితులు అనుకూలిస్తే మే నెలలోనే ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా తయారీకి ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

కొత్త ఓటర్ల చేరిక: 10.07.2025 నుండి 05.02.2026 వరకు కేంద్ర ఎన్నికల సంఘం నవీకరించిన జాబితా ఆధారంగా అదనపు ఓటర్లను గుర్తించనున్నారు.

గడువు: ఓటర్ల డేటాలో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే ఈ నెల 23వ తేదీలోపు నివేదించాలని హైదరాబాద్, మేడ్చల్ మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.

తుది జాబితా: ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది జాబితాను విడుదల చేసి, పోలింగ్ కేంద్రాలను ఖరారు చేస్తారు.

అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి, వాటిని సంబంధిత పంచాయతీ, పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న జాబితాలకు జత చేయాలి. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. వీటి ఆధారంగానే ఎంపీటీసీ, జడ్పీటీసీల పరిధిలోని గ్రామపంచాయతీలు, పోలింగ్ స్టేషన్ల వారీగా కొత్త జాబితాలు రూపొందిస్తారు. ఈ లిస్టులను జిల్లా పంచాయతీ అధికారి కన్ఫామ్ చేసిన తర్వాత.. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ యూజర్ మాన్యువల్ సూచనల ప్రకారం.. పోలింగ్ కేంద్రాలకు అనుసంధానిస్తారు. ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కాదు, రాష్ట్రంలోని ప్రధాన పార్టీలకు ఇదొక అగ్నిపరీక్ష. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, తన సంక్షేమ పథకాలు, పాలనపై ప్రజల తీర్పును ఈ ఎన్నికల ద్వారా నిరూపించుకోవాలని చూస్తోంది. స్థానిక సంస్థలపై పట్టు సాధిస్తేనే క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ బలోపేతం అవుతుందని భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొంత డీలా పడ్డ బీఆర్ఎస్, తన కంచుకోటలైన గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి పట్టు సాధించేందుకు ఈ ఎన్నికలను ఒక అవకాశంగా మలుచుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పు తర్వాత ఏర్పడిన పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునే వ్యూహంలో ఉంది. పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా, గ్రామీణ తెలంగాణలో కూడా పాగా వేయాలని చూస్తున్న బీజేపీకి ఈ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు అత్యంత కీలకం.

2019 మే నెలలో జరిగిన ఎన్నికల తర్వాత ఐదేళ్ల పదవీకాలం ముగిసినా, రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో పిటిషన్లు దాఖలు కావడంతో గతేడాది సెప్టెంబరులో జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా హైకోర్టు అనుమతితో, మే నెలలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. దీంతో వేసవి ఎండలతో పాటు తెలంగాణ పల్లెల్లో రాజకీయ సెగలు మొదలయ్యాయి. బ్యాలెట్ బాక్సుల సిద్ధం చేయడం నుండి పార్టీల వ్యూహాల వరకు అంతా “మే” సమరానికి సిద్ధమవుతోంది. క్షేత్రస్థాయిలో ఏ పార్టీ జెండా ఎగురుతుందో చూడాలి!

మారిన స్థానిక లెక్కలు

గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం వల్ల ఈసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల సంఖ్యలో మార్పులు చోటు చేసుకున్నాయి.

మొత్తం జడ్పీటీసీలు: 566 (4 స్థానాలు తగ్గాయి)

మొత్తం ఎంపీటీసీలు: 5,773 (44 స్థానాలు తగ్గాయి)

మొత్తం జిల్లా పరిషత్‌లు: 31 (మేడ్చల్-మల్కాజిగిరిని అర్బన్ జిల్లాగా మార్చడంతో జాబితా నుండి తొలగించారు).

ఎంపీటీసీ, జడ్పీటీసీలకు చివరిసారిగా 2019 మే 6, 10, 14వ తేదీల్లో ఎన్నికలు జరిగాయి. జూన్‌లో ఎంపీపీ, జడ్పీ ఛైర్‌పర్సన్లను ఎన్నుకున్నారు. కిందటి ఏడాది జూన్‌తో పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నిక ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఇందుకోసం గత సెప్టెంబర్ 29న నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ బీసీ రిజర్వేషన్ల విషయంపై ఎలక్షన్లు ఆగిపోయాయి. గత సెప్టెంబర్‌లోనే ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటికీ, బీసీ రిజర్వేషన్లపై పిటిషన్ కారణంగా అక్టోబర్‌లో హైకోర్టు స్టే ఇచ్చింది. అయితే ఇప్పుడు రిజర్వేషన్ల విధానంపై స్పష్టత రావడంతో కోర్టు అనుమతితో మే నెలలో ఎన్నికలు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ స్థానాల వారీగా జాబితాను సిద్ధం చేసి ఎన్నికల సంఘానికి అందజేసింది.

===============

# సొంత ఇంటికి దూరంగా 38 శాతం ఒకే గదిలో 24 శాతం మంది

హైదరాబాద్, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

ఇటీవలి ఒక సర్వే ప్రకారం తెలంగాణలోని సుమారు 38.4 శాతం కుటుంబాలకు సొంత ఇల్లు లేదు. ప్రాథమిక సౌకర్యాల లభ్యత విషయంలో షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), వెనుకబడిన తరగతులు (బీసీలు) గణనీయంగా వెనుకబడి ఉన్నాయి. ఇతర కులాలు (ఓసీలు), ః అ-అ వర్గాల వారు తక్కువ సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ వర్గాలకు చెందిన వారిలో ఎక్కువ శాతం మంది అద్దె ఇళ్లలోనే నివసిస్తున్నారు. సొంత ఇళ్లు లేని వర్గాలలో ముస్లింలు 60 శాతం, ఓసీలు 50 శాతం వాటాను కలిగి ఉన్నారు. దీనికి భిన్నంగా ఎస్టీలు (72 శాతం), ః అ-ఆ వర్గాల వారు (70.3 శాతం) అధిక శాతం మంది సొంత ఇళ్లలోనే నివసిస్తున్నారు. సుమారు 24 శాతం కుటుంబాలు కేవలం ఒకే గది ఉన్న ఇళ్లలో నివసిస్తున్నాయి. వీరిలో 30.6 శాతం ఎస్సీ కుటుంబాలు, 34 శాతం ఎస్టీ కుటుంబాలు ఉన్నాయి. ఇక సుమారు 23.3 శాతం కుటుంబాలకు తాగునీటి కనెక్షన్లు లేవు. వీరిలో 5.8 శాతం మందికి నీటి సదుపాయమే పూర్తిగా అందుబాటులో లేదు. ఈ వాటాలో 11.1 శాతం ఎస్టీలు, 8.2 శాతం ఎస్సీలు, 4.8 శాతం బీసీలు, 3.9 శాతం ఓసీలు ఉన్నారు. నీటి సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాలలో సుమారు 32 శాతం మంది ఎస్టీ వర్గాలకు చెందినవారే. దాదాపు 9.4 శాతం కుటుంబాలు తాగునీటి కోసం ప్రభుత్వ కుళాయిలపై ఆధారపడుతున్నాయి. ఈ విభాగంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వాటా 12 శాతంగా ఉంది. సుమారు 13.4 శాతం కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు లేవు. ఎస్టీలలో (32 శాతం), ఎస్సీలలో (18.4 శాతం) ఈ నిష్పత్తి ఎక్కువగా ఉండగా, ఇతర వర్గాలలో ఇది తక్కువగా ఉంది. సుమారు 8 శాతం కుటుంబాలకు ఎల్పీజీ (వంట గ్యాస్) సదుపాయం అందుబాటులో లేదు. వీరిలో 15.7 శాతం ఎస్టీలు, 9.7 శాతం ఎస్సీలు, 6.8 శాతం బీసీలు, 5.7 శాతం ఓసీలు ఉన్నారు. దాదాపు 5.4 శాతం కుటుంబాలు వంట కోసం ఇప్పటికీ కట్టెలపైనే ఆధారపడుతున్నాయి. ఎస్టీలలో ఈ వాటా 13.2 శాతంగా, ఎస్సీలలో 6.9 శాతంగా, బీసీలలో 4.5 శాతం, ఓసీలలో 2.5 శాతంగా నమోదైంది.

# 60 శాతం సబ్సిడీతో సోలార్ ప్లాంట్

నిజామాబాద్, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. వీటిల్లో ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ పథకం ఒకటి. దీని కింద 60 శాతం సబ్సిడీతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. 25 ఏళ్ల పాటు ఆదాయం సమకూర్చుకునేందుకు పీఎం కుసుమ్ పథకం అర్హతలు, అప్లికేషన్ ప్రాసెస్ ఇలా ఉంది.



రైతులు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు తమ బంజరు భూములు లేదా సాగుకు పనికిరాని భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60 శాతం సబ్సిడీని అందిస్తాయి. మిగిలిన మొత్తంలో 30 శాతం బ్యాంకుల నుంచి రుణంగా పొందవచ్చు. రైతులు 10 శాతం వాటా పెట్టుబడిగా పెట్టాలి. ఒక మెగావాట్ కెపాసిటీ సోలార్ ప్లాంట్ నుంచి రోజుకు 4,500 యూనిట్ల కరెంట్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్ ను డిస్కమ్ లు యూనిట్‌కు రూ. 3.13 చొప్పున కొనుగోలు చేస్తాయి. అంటే రోజుకు రూ. 14 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. ఈ విధంగా 25 ఏళ్ల పాటు విద్యుత్ కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రిమెంట్ చేసుకుంటాయి.

పీఎం కుసుమ్ పథకం అర్హులు

రైతులు, రైతు సహకార సంఘాలు, డ్వాక్రా సంఘాలు, సహకార సంఘాలు, నీటి వినియోగదారుల సంఘాలు, గ్రామ పంచాయతీ ఈ పథకానికి అర్హులు.

కేటగిరీ ం: బీడు భూముల్లో చిన్న సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం (రైతులు/సహకార సంఘాలు)

కేటగిరీ ః: సోలార్ పంప్ సెట్లు ఏర్పాటుకు (కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 60% రాయితీ)

కేటగిరీ అ: రైతులు అదనపు విద్యుత్‌ను డిస్కామ్‌లకు తిరిగి అమ్ముకోవచ్చు. గ్రిడ్‌కు అనుసంధానించిన వ్యవసాయ పంపులను సౌరశక్తితో నడిచేలా చేయడం.

దరఖాస్తు విధానం

పీఎం కుసుమ్ స్కీమ్ కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ాబివజూ1: పీఎం కుసుమ్ వెబ్ సైట్ ష్ట్రబిబిజూబ:// జూఎనిబీబబీఎ.ఎనితీవ.ఐనీల.తిని/ లో లోన్ అప్లికేషన్ ఫామ్ ఆప్షన్ పై క్లిక్ చేయండి.

ాబివజూ2: స్క్రీన్‌పై కనిపించే రిజిస్ట్రేషన్ ఫామ్ లో లబ్దిదారులు అవసరమైన వివరాలను నమోదు చేయాలి.

ాబివజూ3: డిక్లరేషన్ బాక్స్‌ను టిక్ చేసి, చివరిగా సబ్మిట్ పై క్లిక్ చేయండి.

ాబివజూ4: సోలార్ అగ్రికల్చరల్ పంప్‌సెట్ సబ్సిడీ స్కీమ్ లేదా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కోసం లాగిన్ పై క్లిక్ చేయండి.

ాబివజూ5: ఆన్‌లైన్ అప్లికేషన్ లో సమాచారంతో పాటు అవసరమైన డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయాలి.

పీఎం కుసుమ్ కు అవసరమయ్యే డాక్యుమెంట్స్

ఆధార్ కార్డ్

ల్యాండ్ డాక్యుమెంట్

బ్యాంక్ పాస్‌బుక్

డిక్లరేషన్ ఫామ్

మొబైల్ నంబర్

పాస్‌పోర్ట్ సైజు ఫొటో

# మాదిగ, లంబాడా, ముదిరాజ్, యాదవ కులాల్లో పేదరికం తేల్చి చెప్పిన సామాజిక సర్వే

ఖమ్మం, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20

తెలంగాణ సమాజంలో లోతుగా పాతుకుపోయిన సామాజిక, ఆర్థిక అసమానతలను సీపెక్ తాజా సర్వే నివేదిక మరోసారి కళ్లకు కట్టింది. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నామని భావిస్తున్న తరుణంలో నిర్దిష్ట కులాలు, వర్గాలు ఇంకా పేదరికం, నిరక్షరాస్యత, అస్థిరమైన ఉపాధి కోరల్లోనే చిక్కుకుని ఉన్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సామాజిక న్యాయం, సమాన వృద్ధి అనే లక్ష్యాలకు ఈ అసమానతలు పెను సవాలుగా మారాయి. సర్వే వెల్లడించిన అత్యంతగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే.. రాష్ట్రంలో వార్షికాదాయం రూ. లక్ష లోపు ఉన్న నిరుపేదల సంఖ్య సుమారు 1.10 కోట్లు. ఇందులో దాదాపు 40 శాతం మంది కేవలం నాలుగు కులాలకు చెందినవారే కావడం గమనార్హం. మాదిగ, లంబాడా, ముదిరాజ్, యాదవ కులాల్లో పేదరికం తీవ్రస్థాయిలో ఉంది. తరతరాలుగా వస్తున్న సామాజిక వివక్షతో పాటు.. సరైన భూవసతి లేకపోవడం.. సంప్రదాయ వృత్తులు లాభసాటిగా లేకపోవడం వీరిని పేదరికంలోకి నెట్టివేస్తున్నాయి. ఆర్థిక వనరుల లభ్యత తక్కువగా ఉండటం వల్ల ఈ కులాల్లోని యువత కొత్త వ్యాపారాలు లేదా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయలేకపోతున్నారు. విద్యా రంగంలో ఉన్న అసమానతలు భవిష్యత్తు తరాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉన్నత విద్యకు సంబంధించి సర్వే ఆసక్తికరమైన, ఆందోళనకరమైన విషయాలను బయటపెట్టింది. కొన్ని అభివృద్ధి చెందిన కులాల్లో ఉన్నత విద్యావంతుల శాతం 35.37% గా ఉంటే, వెనుకబడిన కొన్ని వర్గాల్లో ఇది 5% లోపే ఉండటం గమనార్హం. విద్య అనేది పేదరికం నుండి బయటపడటానికి ఉన్న ఏకైక మార్గం.. కానీ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ వర్గాలు ప్రాథమిక విద్యకే పరిమితమవుతున్నాయి. దీనివల్ల ఐటీ, సాఫ్ట్‌వేర్ మేనేజ్‌మెంట్ వంటి అధిక వేతనం వచ్చే రంగాల్లో ఈ కులాల ప్రాతినిధ్యం నామమాత్రంగానే మిగిలిపోతోం. ఉపాధి సంక్షోభం కుటుంబ పోషణ భారం చిన్నారి చేతులకు పని కల్పిస్తోంది. ముఖ్యంగా మాదిగ , ఎస్టీ వర్గాల్లో బాల కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండటం సామాజిక వెనుకబాటుతనానికి పరాకాష్ట. అదేవిధంగా ఉపాధి విషయంలో వడ్డెర కులానికి చెందిన సుమారు 55 శాతం మంది దినసరి కూలీలుగానే జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. వీరికి స్థిరమైన నెలవారీ ఆదాయం లేకపోవడం వల్ల అనారోగ్యం వంటి అత్యవసర సమయాల్లో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఈ వర్గాలకు చేరకపోవడం వల్ల వీరు కేవలం శ్రమశక్తిపైనే ఆధారపడాల్సి వస్తోంది.. సామాజిక న్యాయం ఎక్కడ? ఈ గణాంకాలను విశ్లేషించిన సామాజికవేత్తలు, ప్రభుత్వం తక్షణమే లక్ష్యిత విధానాలను అమలు చేయాలని సూచిస్తున్నారు. కేవలం సంక్షేమ పథకాలు నగదు బదిలీ మాత్రమే కాకుండా ఈ కులాల్లో విద్యా ప్రమాణాలను పెంచడం, వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడం.. పారిశ్రామికంగా ప్రోత్సహించడం వంటి సమగ్ర చర్యలు తీసుకోవాలి.


# ఎంఎంటీఎస్ లలో మహిళలకు ఫ్రీ... ఏడాదికి 10 కోట్లు ఇస్తామంటున్న సర్కార్

హైదరాబాద్, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20


హైదరాబాద్ సిటీలో రోజురోజుకూ ట్రాఫిక్ ఊహించని రీతిలో పెరుగుతోంది. దాంతో హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంఎంటీఎస్ రైళ్లలో అందరికీ ఉచిత ప్రయాణం కల్పించాలని సంచలన నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ సిటీలో నిరంతరం పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా నగర ప్రజలకు పర్యావరణహితమైన, చౌకైన ప్రజారవాణాను అందుబాటులోకి తెచ్చేందుకు ఎంఎంటీఎస్ రైళ్లలో అందరికీ ఉచిత ప్రయాణం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ విప్లవాత్మక నిర్ణయం వల్ల సామాన్యులపై రవాణా భారం తగ్గడమే కాకుండా, నగరంపై వ్యక్తిగత వాహనాల ఒత్తిడి కూడా తగ్గుతుంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి ఈ పథకాన్ని ఏడాది పాటు ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక పథకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, సీఎస్ రామకృష్ణారావు సహా కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో ఇప్పటికే చర్చలు జరిపారు. ప్రస్తుతం ఎంఎంటీఎస్ రైళ్ల ద్వారా లభిస్తున్న సుమారు రూ. 10 కోట్ల వార్షిక ఆదాయాన్ని, ప్రయాణికుల సంఖ్యతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేసింది. గతంలో రోజుకు 1.20 లక్షల మంది ప్రయాణించినా, ప్రస్తుతం సరైన సమయపాలన, ఫ్రీక్వెన్సీ లేకపోవడంతో ఆ సంఖ్య కేవలం 40 వేల లోపునకు పడిపోయింది. ఈ ఆదరణను తిరిగి పెంచేందుకు, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు, వ్యక్తిగత వాహనాల కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం పకడ్బందీ వ్యూహాన్ని రచించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, పురపాలక అభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ దక్షిణ మధ్య రైల్వే శాఖకు రాసిన లేఖలో పలు కీలక సూచనలు చేశారు. రద్దీ సమయాల్లో రైళ్ల సంఖ్యను పెంచడం, రైల్వే స్టేషన్లలో కనీస సౌకర్యాలను మెరుగుపరచడం వంటి అంశాలను ప్రస్తావించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంఎంటీఎస్ సర్వీసులపై ఇటీవల సమీక్షించారని రైల్వే జీఎంకు రాసిన లేఖలో తెలిపారు. రద్దీ వేళల్లో ఎంఎంటీఎస్ రైలు సర్వీసులు పెంచాలని, స్టేషన్లలో సౌకర్యాలు మెరుగు పరచాలని కోరారు. అంతేకాకుండా, ప్రయాణికులకు ‘లాస్ట్ మైల్ కనెక్టివిటీ’ని అందించడానికి రైల్వే స్టేషన్ల నుండి ఇంటికి చేరుకునేలా ఆర్టీసీ షటిల్ బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇందుకోసం స్టేషన్ ప్రాంగణాల్లో అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. దక్షిణ మధ్య రైల్వే ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తూ, ముసాయిదా ఎంవోయూ పంపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్ సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖకు ఇవ్వాల్సిన రూ. 491.45 కోట్లు చెల్లించాలని సైతం కోరింది. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం అనుమతులు లభించిన వెంటనే, రైళ్ల సమయాలు, నిర్వహణపై స్పష్టత రానుంది. ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించిన నిధుల చెల్లింపు అంశం కూడా ఈ చర్చల్లో ప్రముఖంగా నిలిచింది. ఈ పథకం విజయవంతమైతే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలవుతుంది.

# శునకాలతో ప్రజలు బెంబేలు

**-వీధికుక్కలతో భయభ్రాంతులకు గురువుతున్న పట్టణ ప్రజలు**
**-ఏ వీధిలో చూసినా శునకాల గుంపులే**
**-రాత్రి సమయాల్లో దాడులకు దిగుతోన్న శునకాలు**
**-రోడ్లపై యథేచ్ఛగా కుక్కలు సంచారం**
**-మాసం దుకాణాల వద్ద కుక్కలు కుమ్ములాట**
**-పలు ప్రాంతాల్లో,బాటసారులు, వాహన దారులు మహిళలు, పిల్లలపై దాడులు**
**-నియంత్రించడంలో మున్సిపాలిటీ అధికారులు విఫలం**







మణుగూరు, ఏప్రిల్ 20 (భారతశక్తి): మణుగూరు పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఏ వీధిలో చూసినా శునకాలు గుంపులుగా కనిపిస్తున్నాయి. పాదచారులు, వాహనదారులపై వాటి దాడులు కూడా ఎక్కువయ్యాయి. దీంతో ఒంటరిగా బయటకు వెళ్లాలంటే వృద్ధులు, చిన్నారులు భయాందోళన చెందుతున్నారు. రోడ్లపై స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలను నియంత్రించడంలో మున్సిపాలిటీ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేబిస్ వ్యాధి ముప్పుపొంచి ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణంలో మాంసం దుకాణాలు వద్ద శునకాల సమస్య ఎక్కువగా ఉంది. ప్రధాన రోడ్లపై రాత్రి సమయాల్లో విశ్రాంతి తీసుకుంటూ ఒక్కసారిగా వాహనాలు, పాదచారులపై దాడులకు దిగుతున్నాయి. భయంతో అరిచేవారిపై మరింత ఎగబడుతున్నాయి. ఇక వాహనాల వెంట పరుగెడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఇటీవల కాలంలో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఎక్కడ చూసినా అవే కనిపిస్తున్నాయి. వీధి కుక్కలను తరుచూ నియంత్రించాల్సిన మున్సిపాలిటీ అధికారులు చేతులెత్తేయడంతో కుక్కల దాడులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎక్కువగా మాంసం దుకాణాల రహదారుల వద్దే కుక్కల దాడులు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. చికెన్ షాపుల వద్ద ఆవ్యర్థాల్లోని ఆహారం కోసం కుక్కలు గుంపులుగా వచ్చి చేరుతున్నాయి. ఈక్రమంలో అవి ఘర్షణకు దిగుతున్నాయి. వాటిని చెదరగొట్టేందుకు ప్రయత్నిస్తే ప్రతిదాడులకు పాల్పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

గొప్పలు చెప్పుకుంటున్నా యజమానులు

మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్, గణేష్ బజార్ లో పిచ్చమ్మ అనే మహిళ ఓ పెంపుడు కుక్కను పెంచుకుంటున్నారు. ఆ కుక్క పరిసర ప్రాంతాల్లో వ్యక్తులపై ఎగబడి గాయపరిచిన సందర్భాలు ఉన్నాయి. వారు దానిని గొప్పగా చెప్పుకుంటున్నారే తప్ప కుక్కలను మనుషులపై రాకుండా జాగ్రత్తలు పాటించడం మానేశారు. సోమవారం ఉదయం పిచ్చమ్మ వాళ్ళఇంటికి పాలకు వెళ్లిన అతనిపై ఎగబడి గాయపరుస్తున్న యజమానులు సినిమా చూసినట్లు చూస్తున్నారే తప్ప దానిని నియంత్రించాలానే ఆలోచన లేకుండా పోయింది. ఈ మధ్య కాలంలో శేషగిరి నగర్ లో చిన్నారిని కుక్కలు వెంబడించి గాయపరిచాయి. గతంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో మహిళలు, పిల్లలపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సందర్భాలున్నాయి.

పట్టణ వాసుల్లో రేబిస్ భయం

కుక్కల నుంచి మనుషులకు సోకే అత్యంత ప్రమాదకర వ్యాధి రేబిస్. ఈవ్యాధి కారక వైరస్ కుక్క కరిచినప్పుడు శరీరంలోకి ప్రవేశించి నాడీ వ్యవస్థ ద్వారా మెదడుకు చేరి ప్రాణాంతకంగా మారుతుంది. కుక్కలు కరిచిన 2-3 నెలల తర్వాత, ఒక్కోసారి ఏడాది తరువాత కూడా రేబిస్ తో మరణించిన దాఖలాలున్నాయని పశుసంవర్ధక శాఖ అధికారులు చెప్తున్నారు. శరీరంలో కుక్క కరిచే ప్రాంతాన్ని బట్టి ఆ వైరస్ సోకే వ్యవధి ఉంటుందని వైద్యులు అంటున్నారు. చెత్తకుప్పల వద్ద జరిగే ఘర్షణల్లోనే ఒక కుక్కనుంచి మరో కుక్కకు కూడా రేబిస్ వ్యాప్తిచెందుతోందని గుర్తించినట్లు పశు వైద్యులు చెబుతున్నారు.

నియంత్రణలో మున్సిపాలిటీ అధికారుల వైఫల్యం

పట్టణంలో విచ్చిలవిడిగా పెరుగుతున్న కుక్కల సంఖ్యను నియంత్రించడంలో మున్సిపాలిటీ అధికారులు విఫలం చెందారని ప్రజలు విమర్శిస్తున్నారు. శునకాల నియంత్రణ మున్సిపాలిటీ బాధ్యత అయినప్పటికీ ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను పెంచుకోవడం.. కొంతకాలానికి వాటిని రోడ్లపై వదిలేయడం కొంతమందికి పరిపాటిగా మారింది. జంతువుల మీద ప్రేమ ఉన్నట్లు నటించి కొంతకాలానికి రోడ్లపై వదిలేస్తుండటంతో సమస్య మరింత జఠిలంగా మారుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. కుక్కల ప్రాణం తీసే అధికారం మున్సిపాలిటీకి లేకపోయినా కనీసం సంతానోత్పత్తినైనా నివారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా బసవేశ్వర జయంతి టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20:

మహాత్మ బసవేశ్వర జయంతి సందర్భంగా టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సంగారెడ్డిలోని బసవేశ్వర విగ్రహాలకు పూల మాలలు సమర్పించారు.మొదట సంగారెడ్డి పట్టణంలోని ఎలక్ట్రిసిటీ కార్యాలయంలో ఉన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. బైపాస్ రోడ్డులోని బసవేశ్వర విగ్రహానికి ఆమె పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా లింగాయత్ సమాజ్ ఆధ్వర్యం లో నిర్మలా జగ్గారెడ్డి ని , మున్సిపల్ చైర్మన్ , కౌన్సిలర్ ల ను ఘనంగా సన్మానించారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాయకమే కైలాసం అని మహాత్మా బసవేశ్వరుడు శ్రమ యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పాడన్నారు. సామాజిక సంస్కరణ కోసం, సామాజిక అసమానతలు, కుల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్తగా బసవేశ్వరుడి పాత్రను నకొనియాడారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, నాయకుడు కూన సంతోష్, కౌన్సిలర్లు వంశీ, సతీష్ రెడ్డి, హరిష్ , లింగాయత్ సమాజ్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి ఒక్క రోజు మాత్రమే వీఐపీ: ఎంపీ చామల కిరణ్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 20: మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఎంపీ చామల కిరణ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందన్నారు. జీవన్ రెడ్డి పార్టీలో చేరడం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేదన్నారు. జీవన్ రెడ్డిని ఎప్పుడూ హరీశ్ రావు పార్టీలోకి ఆహ్వానించలేదని తెలిపారు. జీవన్ రెడ్డి ఇంటికి కేటీఆర్ వెళ్లినప్పుడు హరీశ్ వెళ్లలేదని అన్నారు. రెండవ సారి జగిత్యాలకు వెళ్లినప్పుడు కేటీఆర్.. హరీశ్ రావు ఇంటికి వెళ్లి బ్రతిమిలాడి తీసుకువెళ్లారంటూ వ్యాఖ్యలు చేశారు.కేసీఆర్ ఇంటికి జీవన్ రెడ్డి వచ్చినప్పుడు కూడా హరీశ్ రావు వెళ్లలేదని ఎంపీ తెలిపారు. కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి కొత్త పార్టీ పెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ సంవత్సరం తర్వాత ఫామ్‌హౌస్ నుంచి బయటకు వస్తుంటే హరీశ్ రావు ఢిల్లీ వెళ్లారంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భవిష్యత్తు అంధకారంలో ఉందన్నారు. హరీశ్ రావు ఢిల్లీలో ఎవరిని కలిసి మాట్లాడారు అనేది త్వరలో బయటకు వస్తుందన్నారు. హరీశ్ భవిషత్తు ప్రణాళికలు ఏంటి అనేది ప్రజలకు తెలుసన్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడం వలన లాభం కంటే నష్టమే ఎక్కువని ఎంపీ అన్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడం వాళ్ల కార్యకర్తలకే ఇష్టం లేదని తెలిపారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శించారు.

జీవన్ రెడ్డికి కాంగ్రెస్ సముచిత స్థానం ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి ఒక్క రోజు మాత్రమే వీఐపీ అంటూ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన సీనియర్ నేతల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. జీవన్ రెడ్డిని చేర్చుకుని కాంగ్రెస్ బలహీన పడిందని చెప్పే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ మునిగిపోయే పడవ అంటూ ఎంపీ చామల కిరణ్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## ధర్మపురి పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ ను అభినందించిన మంత్రి అడ్లూరి

జగిత్యాల, ఏప్రిల్ 20( భారత శక్తి ప్రతినిధి ):

తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని ఆదివారం రోజు సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ధర్మపురి ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షుడు మొహమ్మద్ షబ్బీర్ ''సదర్'' మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ షబ్బీర్‌ను శాలువాతో సన్మానించి, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ అభివృద్ధికి, మైనారిటీ సంక్షేమానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని ప్రజలకు చేరువ చేయడంలో కమ్యూనిటీ నాయకులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు.షబ్బీర్ "సదర్" మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముస్లిం సమాజ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ విభాగం నాయకులు పాల్గొన్నారు.

# అర్జీలను ప్రత్యేక శ్రద్ధ తో పరిష్కరించాలి: జిల్లా జాయింట్ కలెక్టర్

వైఎస్ ఆర్ కడప జిల్లా,ఏప్రిల్ 20(భారత శక్తి ): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా .నిధి మీనా అధికారులను ఆదేశించారు

సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ తో పాటు ఇంచార్జి డి ఆర్ ఓ వెంకట పతి,వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు.ఈవేదిక ద్వారా అంతే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకం గా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరి గా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలాఅర్జీలనుపరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగాపరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు..అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.




ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.

1.మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పట్టణంలో ప్రధాన రహదారులు, డ్రైనేజీలు, డ్రైనేజీ ఆక్రమణలు, పన్నుల భారం తదితర అంశాలపై విచారణ జరిపి మైదుకూరు ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ రైతు సేవా సమితి వారు అర్జీ సమర్పించారు.

2.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలకు ప్రభుత్వం కార్పొరేషన్ ల ద్వారా రుణాలు మంజూరు చేయవలసిందిగా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య వారు అర్జీ సమర్పించింది

3.వైఎస్సార్ కడప జిల్లా వై జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ భవనం శిథిలావస్థ దశలో నిలిచిపోయిందని పేర్కొంటూ, ఆ భవనాన్ని తిరిగి ప్రారంభించాలని అంబేద్కర్ స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ వారు అర్జీ సమర్పించింది.

4.నందలూరు మండలం, నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన యం.సుజాత తమకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరుతూ అర్జీ సమర్పించారు.

5.బద్వేలు మండలం, గోపవరం గ్రామానికి చెందిన చిన్ని చెంచు రత్నం తమ భూమిని ఇతరులు ఆక్రమించారని పేర్కొంటూ, తమ భూ సమస్య ను పరిష్కరించవలసిందిగా అర్జీ సమర్పించారు.

6.మైదుకూరు మండలం, సర్వాయపల్లి గ్రామానికి చెందిన యం.పుల్లారెడ్డి గారు తమ అల్లుడు నారాయణ రెడ్డి పేరు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ లో ఉండటంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని పేర్కొంటూ,ఆ పేరును తొలగించవలసిందిగా కోరుతూ అర్జీ సమర్పించారు

7.వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వై. గోపాల్ గారు తమ కుమార్తె పేరుమీద ఉన్న టిడ్కో గృహాన్ని తమ పేరుమీదకు మార్చవలసింది గా అర్జీ సమర్పించారు.

8.వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పెనుగొండ పుల్లమ్మ రేషన్ కార్డు మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు.

# సమసమాజ స్థాపకులు.. గొప్ప సంఘ సంస్కర్త బసవన్న.

## –బసవేశ్వరుడి జయంతి వేడుక సభలో ఇంచార్జి డీఆర్వో వెంకటపతి



కడప, ఏప్రిల్ 20(భారత శక్తి ) : వర్గ, వర్ణ, లింగ భేదాలను తెంచివేసి, ఒక సమ సమాజాన్ని స్థాపించిన గొప్ప సంఘ సంస్కర్త శ్రీ బసవేశ్వరుడు (బసవన్న) అని ఆధునిక సమాజానికి ఆయన చరితం ఆదర్శనీయం అని ఇంచార్జి డీఆర్వో వెంకటపతి అభివర్ణించారు.

సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని సభాభవన్ లో యువజన సంక్షేమ శాఖ, పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త బసవేశ్వరుడి జయంతి వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకటపతి, జిల్లా అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా డిఆర్వో వెంకటపతి మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా ప్రతి ఏడాది నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఏడాది వైశాఖ మాసం మూడవ రోజును ఆయన జన్మదినంగా చరిత్ర పరిగణించడం జరిగిందని ప్రస్తుతం బసవేశ్వరుని జయంతి వేడుకను జరుపుకోవడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఆయన చెప్పిన వాక్కులు నేటి సమాజానికి ఆదర్శనీయం అన్నారు.

హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో బసవేశ్వరుడు (1134--1196) ఒకరని సమాజంలో అందరూ సమానమేనని సత్యాన్ని ఎనిమిది వందల సంవత్సరాల క్రితమే చాటి చెప్పిన సంఘ సంస్కర్త అన్నారు. అందుకే ఆయనను బసవన్న, బసవుడు, విశ్వగురు అని పలువురు సామాజిక సంఘ పెద్దలు పిలుస్తారన్నారు. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడు లింగాయత ధర్మాన్ని స్థాపించారన్నారు.

కర్ణాటక రాష్ట్రం బాగేవాడిలో జన్మించిన బసవేశ్వరుడి తండ్రిదండ్రులు మాదిరాజు, మాదాంబలు ఉపనయనం చేస్తున్న తల్లిదండ్రులను వదలి కూడలసంగమ అనే పుణ్యక్షేత్రం దగ్గరకు చేరి అక్కడ ఉన్న సంగమేశ్వరుణ్ణి నిష్ఠతో ధ్యానించాడు. చిన్న వయసులోనే శైవ పురాణ గాథలను అభ్యసించిన ఆయన 12వ శతాబ్దంలోనే కర్ణాటక దేశాన్ని పాలించిన బిజ్జలుని కొలువులో చిన్న ఉద్యోగిగా స్థానం సంపాదించారు. అనతి కాలంలోనే భాండాగారానికి ప్రధాన అధికారిగా పదోన్నతి పొంది భండారీ బసవడుగా ఖ్యాతిని పొందాడు. బసవేశ్వరుడు బోధించిన సంప్రదాయమే అనంతర కాలంలో "లింగాయత ధర్మం"గా స్థిరపడింది. తెలుగులో సోమనాథుడు బసవపురాణం రాశారని శివుడే సర్వేశ్వరుడన్న విశ్వాసంతో శివతత్వ ప్రచారానికి పూనుకున్నారని అలా లింగాయత మతానికి బీజాలు వేశారన్నారు.

అప్పట్లో ఆడవారికి, దళితులకు ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులు ఉండేవి కావని అలాంటి కాలంలో బసవన్న సమాజంలో అణగరిన వారికి, మహిళలకు అన్ని హక్కులు కల్పించారన్నారు. వర్గ, వర్ణ, లింగ భేదాలను తెంచివేసి, ఒక సమాజాన్ని స్థాపించాడు. మానవతావాది, సంఘ సంస్కర్త అయిన బసవేశ్వరుడు. కుల, మత వర్ణ, వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. ఆ వ్యవస్థను రూపుమాపడానికి క్రీస్తు శకం 12వ శతాబ్దంలోనే పోరాటాన్ని సలిపిన సాంఘిక విప్లవకారుడు అన్నారు. బూజుపట్టిన మూఢాచారాలకు, సంప్రదాయాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగరేసిన మొదటి సంఘ సేవకుడుగా బసవేశ్వరుడు ప్రాచుర్యం పొందారన్నారన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యుటీ కలెక్టర్లు రంగస్వామీ, శివరామిరెడ్డి, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, డిఆర్డీఏ పీడి రాజ్యాలక్ష్మి, డిపివో వెంకట సుబ్బయ్య, టూరిజం అధికారి సురేష్ కుమార్, లింగాయత్ కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి పిర్యాదుల పై సత్వరమే చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 20:

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన



పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి గ్రీవిన్స్ లకు కూడ అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తు లను పరిష్కరించాలని తెలిపారు. వేసవిలో ప్రజల కొరకు ప్రతి గ్రామపంచాయతీలో బస్ స్టాప్, పబ్లిక్ ప్రాంతాలలో, ఉపాధి హామీ పనులు జరిగే చోట, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎండ తీవ్రత దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉదయం 11:30 నుండి సాయంత్రం 4:00 వరకు కొనుగోళ్లు నిలిపివేయాలని, తదుపరి 4 గంట నుండి రాత్రి వరకు అవసరమైతే ఫ్లడ్ లైట్లు పెట్టుకొని రాత్రి 10:00 వరకు కూడ నిర్వహించుకోవచ్చు అని, ఉదయం 4 గంటల నుంచి కూడ కొనుగోళ్లు ప్రారంభించుకోవచ్చని అన్నారు. డిఎం అండ్ హెచ్ ఓ, పీహెచ్ సీల నుండి ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, సెలైన్లు అందుబాటులో ఉంచాలని, కలెక్టరేట్లో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎండ నుండి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలని తలకు క్యాపులు ధరించాలని, కలెక్టరేట్లో కూడా అవసరమైతే మరికొన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ పరిపాలన అధికారిని ఆదేశించారు. ప్రతి మండలం నుండి తాసిల్దార్ ద్వారా ప్రతి రోజు టెంపరేచర్ రిపోర్ట్ అందించాలని, ఆర్డబ్ల్యూఎస్, డిపిఓ త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. జనన గణన గురించి కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్, 26 నుండి ప్రారంభమగు హౌస్ లిస్టింగ్ లో ప్రతి ఉద్యోగి సొంతంగా వారి యొక్క కుటుంబ వివరాలు 33 ప్రశ్నలకు వివరాలు అందించాలని, వెన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు, వారికి ఆ నివేదికను అందించాలని కలెక్టరేట్ లోని ప్రతి శాఖ వారి పరిధిలో గల మండల, గ్రామ కార్యాలయాల పరిధిలో గల సిబ్బంది ద్వారా ప్రజలకు జనన గణన గురించి అవగాహన కల్పించాలని అన్నారు. తదుపరి కలెక్టర్ సిపిఓ ద్వారా జనన గణన అవగాహన ఫ్లెక్సీ బోర్డును ఆవిష్కరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 31 దరఖాస్తులు, డిఆర్డిఏ 4, మున్సిపాలిటీ 3,

డిపిఓ 3, డిఎం అండ్ హెచ్ ఓ 3 మిగిలిన 17 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.

ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే సీతారామా రావు, సీఈఓ జడ్పీ శిరీష, డిపిఓ యాదగిరి, డిఎంహెచ్వో పి వెంకటరమణ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, సిపిఓ కిషన్, డీఎస్ఓ, డిటిడిఓ శంకర్, ఎస్సీ కార్పొరేషన్ డెవలప్మెంట్ అధికారి దయానందరాణి, డి ఐ ఈ ఓ బి సులోచన రాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరిండెంట్లు శ్రీలత, సాయి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు.

# కేసుల సత్వర పరిష్కారం కోసం న్యాయవాదులు కృషి చేయాలి.

## -రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటీవ్ జడ్జి జస్టిస్ కె. శ్రీనివాస రెడ్డి

–విశిష్ట అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి బాలాజీ మెడమల్లి, కడప ప్రధాన జిల్లా న్యాయమూర్తి డా. సి. యామిని, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరు.

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 20(భారత శక్తి ) : న్యాయస్థానాల్లో ఉన్న పరిమిత అవకాశాలను సద్వినియోగించుకుని కేసులను సత్వరమే పరిష్కరించేందుకు కృషిచేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటీవ్ జడ్జి శ్రీ జస్టిస్ కె. శ్రీనివాస రెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులకు సూచించారు.

సోమవారం ప్రొద్దుటూరులో నూతనంగా నిర్మించిన ఎ××× అదనపు జిల్లా ఠ సెషన్స్ కోర్టు మరియు అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల నూతన భవన సముదాయాలను గౌరవ రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటీవ్ జడ్జి జస్టిస్ కె. శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి బాలాజీ మెడమల్లి, కడప ప్రధాన జిల్లా న్యాయమూర్తి డా. సి. యామిని, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి మారుతి ప్రసాద్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటీవ్ జడ్జి కె. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు న్యాయస్థానానికి ఉన్న 135 ఏళ్ల విశిష్ట చరిత్రను గుర్తుచేస్తూ, ప్రజలకు మరింత సమర్థవంతమైన న్యాయసేవలు అందించేందుకు ఈ నూతన కోర్టుల స్థాపన ఒక ముఖ్యమైన మైలురాయిగా పేర్కొన్నారు. ఈ నూతన కోర్టు భవన ఏర్పాటుకు కృషి చేసిన ప్రొద్దుటూరు బార్ అసోసియేన్ అధ్యక్షులు, సభ్యులకు అభినందనీయం అన్నారు. ఈ కోర్టులో న్యాయవాదులు, కక్షిదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకుని కేసులు సత్వరమే పరిష్కారాలు అయ్యేలా న్యాయవాదులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. "గమ్యం చేరుకున్నపుడే గమనం సార్థకం అవుతుంది" అని ఆయన యువ లాయర్ల ఆయన ఇచ్చిన సందేశం కొండంత స్ఫూర్తిని నింపింది. రాష్టంలో బార్ అసోసియేషన్ భవనాల విషయంలో కేంద్ర,



రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. న్యాయస్థానాల్లో సరైన కనీస, మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే కేసుల పరిష్కారం పెండింగ్ లేకుండా సులభతరం అవుతుందన్నారు. న్యాయవ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విషయాల్లో సహాయ సహకారాలు అందిస్తున్నాయన్నారు. న్యాయ వ్యవస్థ ప్రజలకు చేరువ కావడం అత్యంత ముఖ్యమని, కొత్త కోర్టుల ఏర్పాటుతో కేసుల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. విశిష్ట అతిథి బాలాజీ మెడమల్లి న్యాయ సేవల విస్తరణకు ఇది కీలక అడుగని అభిప్రాయపడ్డారు. ప్రధాన జిల్లా న్యాయమూర్తి డా. సి. యామిని న్యాయ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాలో ఎప్పటి నుండో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పెండింగ్ కేసులను అనతి కాలంలో త్వరితగతిన పరిష్కరిస్తున్న జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. కడప ప్రధాన జిల్లా న్యాయమూర్తి డా. సి. యామిని మాట్లాడుతూ భౌగోళికంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ప్రొద్దుటూరు నియోజకవర్గ కేంద్రంలో కోర్టు నూతన భవన సముదాయం ప్రారంభోత్సవం చేసుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ కేసుల సత్వర పరోష్కారం కోసం అన్ని కోర్టులో సరైన మౌలిక సదుపాయాలను కల్పించి వ్యయ వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా అదనపు బెంచ్ కోర్ధులను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. న్యాయ వ్యవస్థలో మౌలిక సదుపాయాల కల్పన కోసం జిల్లాలో తనవంత సహకారం ఎప్పటికీ ఉంటుందని తెలియజేసారు. కార్యక్రమంలో చివరగా బార్ అసోసియేషన్ సభ్యులు ప్రముఖులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ముందుగా నూతన కోర్టు భవన సముదాయాలను గౌరవ రాష్ట్ర హైకోర్టు పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాస రెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించగా ఆయనతో పాటు ప్రారంభోత్సవ పూజా కార్యక్రమంలో గౌరవ శ్రీ జస్టిస్ బాలాజీ మేడమల్లి పాల్గొన్నారు. పూజ అనంతరం సర్వ మతాల సాక్షిగా న్యాయ వ్యవస్థ సుభిక్షంగా నడవాలని అర్చక, ఫాస్టర్, మౌజం మత గురువులు ఆశీర్వచనాలు అందించారు.

ఈ కార్యక్రమంలో కడప 2వ అదనపు జిల్లా న్యాయమూర్తి కె. సత్య కుమారి గారుతో పాటు ఇతర న్యాయమూర్తులు, జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ - తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారతశక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 20:

మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ లలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు సూచించారు. సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటా రూ. 2400 మద్దతు ధర కల్పిస్తుందని, మార్కెట్ లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో పంటను అమ్మి మద్దతు ధర పొందాలన్నారు.

బయట నుండి ధాన్యం రాకుండా పటిష్ట భద్రత


ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు ధాన్యం రాకుండా బార్డర్ చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, సివిల్ సప్లయ్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పని చేస్తూ బయట నుండి ధాన్యం రాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి అందిస్తున్న బోనస్ తెలంగాణ రైతులు పొందేలా బయట నుండి ధాన్యం రాకుండా ఆదేశాలు జారీ చేశామని, ధాన్యం వస్తున్నట్లు సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, దాదాపు 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు రూ. 5లకే నాణ్యమైన భోజనం

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో రైతుల కోసం ఏర్పాటు చేసిన రూ. 5ల భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్ సౌజన్యంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ. 5 అన్నపూర్ణ భోజనాన్ని కలెక్టర్ ప్రారంభించి రైతులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దూరం నుండి పంటను అమ్ముమునేందుకు వస్తున్న రైతులకు మంచి క్వాలిటీ భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నం, కూర, పప్పు, పచ్చడితో రైతులకు నాణ్యత భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని, సీజన్ సమయంలో భోజనం తో పాటు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టిఫిన్ ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, డి.ఎ.ఓ. శ్రీధర్ రెడ్డి, డి.ఎం.ఓ. నాగేశ్వర శర్మ, డి.సి.ఓ. ప్రవీణ్, ఎ.ఎం.సి.డైరెక్టర్స్, రైతులు, తదితరులు పాల్గొన్నారు

# సమసమాజానికి మార్గదర్శి బసవేశ్వరుడు : ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 20 : సమానత్వం, సామాజిక న్యాయం, మహిళలకు గౌరవస్థానం కల్పించడం వంటి మహోన్నత సిద్ధాంతాలతో సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు శ్రీ బసవేశ్వరుడు అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. కుల వివక్షను నిర్మూలించి సమాన హక్కుల కోసం పోరాడిన మహనీయుడిగా ఆయన బసవేశ్వరుడిని కొనియాడారు.బసవ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బైపాస్ వద్ద ఉన్న బసవేశ్వర విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా విద్యుత్ కార్యాలయం ఎదుట ఉన్న బసవేశ్వర విగ్రహానికి కూడా పూలమాల వేసి గౌరవ నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో విజేందర్ రెడ్డి, రాజేశ్వర్, రామప్ప, జిల్లా అధికారి జగదీష్, నర్సింలు, నాగరాజ్ గౌడ్, కౌన్సిలర్లు నవీన్, పొన్న రాజేందర్ రెడ్డి, జలేందర్, దశరథ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ విష్ణు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

- **గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం**
- **జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20(భారత శక్తి): జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని *జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్* పేర్కొన్నారు.

## గిరివాణి, ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ దివాకర

- **పాఠశాలలు, వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి**





ఏటూరు నాగారం/ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20 (భారత శక్తి) : పాఠశాలలు, వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, గిరివాణి, ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ అధికారి దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏకార్యాలయ సమావేశమందిరంలో సోమవారం ప్రజావాణి గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను స్వయంగా కలెక్టర్‌కు అందించారు. జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమానికి 96, ప్రజావాణి కార్యక్రమానికి 26, మొత్తం 122 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పాఠశాలలు, వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం వాటిని పర్యవేక్షించి, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను రూపొందించాలని సూచించారు. వంటశాల, స్టోర్ రూమ్, క్యాంపస్ పరిసరాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి లాంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను వెంటనే అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్ జి, ఏపీవో వసంతరావు, ఆర్డీఓ వెంకటేష్, డీడీ జనార్దన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ, ఐటీడీఏ ఏఓ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాలేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి పనులు, నూతన బస్టాండ్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన

భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 20 (భారత శక్తి):భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కాలేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి కోసం రూ.198 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పునర్ అభివృద్ధి నిర్మాణ పనులకు, అలాగే రూ.3.70 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న కాలేశ్వరం బస్టాండ్ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, గడ్డం వివేక్ , పార్లమెంట్ సభ్యులు వేం రెడ్డి నరేందర్ రెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ కాలేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకుని మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శుభానంద దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులకు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రాలతో ఘనంగా సన్మానించారు.కాళేశ్వరం విచ్చేసిన ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పుష్ప గుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.



## నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్

మెదక్ జిల్లా నర్సాపూర్ (భారత శక్తి న్యూస్) ఏప్రిల్ 20:నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశమై, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు మరియు విద్యా ప్రమాణాలపై వివరంగా చర్చించారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, పరిశుభ్రత వంటి అంశాలను స్వయంగా పరిశీలించి, అవసరమైన చోట వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కూడా పాల్గొని పాఠశాల అభివృద్ధికి అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల అభివృద్ధికి మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని చైర్మన్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించి, పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మ బసవేశ్వర జయంతి వేడుకలు



కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 20: ఐడిఓసి, కామారెడ్డి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మ బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, మధు మోహన్ మహాత్మ బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మహాత్మ బసవేశ్వరుడు (1134-1196) 12వ శతాబ్దానికి చెందిన గొప్ప భారతీయ తత్వవేత్త, సంఘ సంస్కర్త, కవి, లింగాయత్ ధర్మ స్థాపకుడు అని పేర్కొన్నారు. కులవ్యవస్థ, లింగ వివక్షత, మూఢనమ్మకాలపై పోరాడి, 'అనుభవ మంటపం' ద్వారా సమానత్వం, సత్యం, శ్రమ గౌరవాన్ని ప్రచారం చేసిన మహనీయుడు అని వివరించారు. 'కాయక కైలాస' (కష్టపడి పనిచేయడమే కైలాసం) అనే సందేశంతో శారీరక శ్రమకు, నిజాయితీకి ప్రాధాన్యత ఇచ్చిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అలాగే బహుజన సంఘాల నాయకులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ , బి.సి. అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ అభివృద్ధి అధికారి చక్రధర్, బహుజన సంఘాల నాయకులు కొత్తపల్లి మల్లయ్య, బి.సి. నాయకులు నాగరాజు, లింగాయత్ సమాజ ప్రతినిధులు కపిల ప్రభాకర్, ఇతర నాయకులు అశ్వక్, నరేష్, శాంతయ్య, స్వప్న, పవన్ తదితరులు, జిల్లా అధికారులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంబటి అనుదీప్ హంతకులను అరెస్ట్ చేయాలి

- **అనుదీప్ మరణం పై ఆందోళన కు కార్యాచరణ సిద్ధం**
- **రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్దన్**



విజయవాడ, ఏప్రిల్ 20 (భారత శక్తి ప్రతినిధి): దివంగత అంబటి అనుదీప్ హత్య లో బెదిరింపులకు పాల్పడిన వారి పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్దన్ డిమాండ్ చేశారు. అనుదీప్ నివాసం లో కార్యాచరణ కోసం చా ట్రాయ్ కాపు పెద్దలతో,కుటుంబ సభ్యులు బంధువులతో ఏర్పాటు చేసిన సమావేశం లో అనుదీప్ మరణం అంశం లో పోలీస్ విచారణ అధికారులు అనుసరించిన,అనుసరిస్తున్న విధానం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.దీనికి నిరసనగా ఉద్యమ బాట పట్టాలని నిర్ణయం తీసుకున్నారు.అనుదీప్ ఇంటి వద్ద రిలే కార్యక్రమాలు,స్థానిక పోలీస్ స్టేషన్ ముందు శాంతియుత నిరసన కార్యక్రమం,ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేయాలని నిర్ణయం జరిగింది.ఈసందర్భం గా రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్ధన్ మాట్లాడుతూ అంబటి అనుదీప్ మరణం పట్ల అధికార యంత్రాంగం ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడాన్ని ఖండించారు.హత్య పై విచారణ వేగవంతం చేయాలి,బెదిరించిన వారి పై హత్య కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.అనుదీప్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.ఈసామావేశం లో జనసేన నాయకులు తుమ్మల జగన్,తెలుగు దేశం నాయకులు కమ్ముల కొండలు,శ్రీరాముల సత్యనారాయణ,అంబటి శ్రీనివాసరావు,బుర్ర శంకర్,తుమ్మల శంకర్,అవినాష్,రాజేష్,శేఖర్,అంబటి చలపతి రావు,తుమ్మల చలపతిరావు,శివ,రామారావు సవరం,అంబటి శివయ్య, అంబటి రాంబాబు, అంబటి అమల,నాగలక్ష్మి మరో 75 మంది నాయకత్వం పాల్గొన్నారు.

## ధర్మపురి లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలు



జగిత్యాల,ఏప్రిల్ 20(భారత శక్తి ప్రతినిధి ): ధర్మపురిలో బి ఆర్ ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినం సందర్భంగా స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. తదుపరి నంది చౌక్ వద్ద కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి,మాజీ మున్సిపల్ మాజీ చైర్మన్ సంగి సత్తెమ్మ , ధర్మపురి మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్ , పట్టణ కన్వీనర్ బండారి రంజిత్. నాయకులు ఓడ్నాల మల్లేశం, సంగి శేఖర్, చిలువేరి శ్యాంసుందర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, చిర్నేని నర్సయ్య,బండారి అశోక్,చుక్క రవి,బాకీ శేఖర్,గుర్రాల సుధాకర్,మురికి శ్రీనివాస్,అనంతుల విజయలక్ష్మి,ఎండీ షమీమా,తరాల కార్తీక్,సయ్యద్ ఆసిఫ్,జెట్టి రాజన్న, ఆనందాసు శ్రీనివాస్, స్తంభంకాడి మహేష్,నక్క రాజేందర్, ముత్తినేని లక్ష్మణ్,మామిడి శ్రీనివాస్ ,అక్కనపెల్లి సురేందర్, చల్ల రవి,కాశెట్టి విజయ్,కుక్కల గంగారెడ్డి, కాశవేని శ్రీనివాస్,అనంతుల లక్ష్మణ్, రాజిరెడ్డి, మొలుగూరి రాజన్న,అంబటి లక్ష్మణ్,నూనె సాయి ,మామిడి శివసాయి, జీధుల గంగన్న, ఈర్ల మొండయ్య, మల్లేష్, జగన్,ఆకుల రాజేష్,షెకెల్లి సాయి, రాహుల్,శివ,రాజేశం,సురేష్, యశ్వంత్,మున్నా,నరేందర్ తదితరులు పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం



జగిత్యాల,ఏప్రిల్ 20 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి నియోజకవర్గంలో రోళ్లవాగు, అక్కెపెల్లి ఎత్తిపోతల పథకంతో పాటు నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించే బాధ్యత తాను తీసుకుంటానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి అక్కెపెల్లి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో 90 శాతం మంది వ్యవసాయ ఆధారితంగా జీవనం సాగిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందించడానికి రోళ్ళవాగుతో పాటు అక్కెపల్లి ఎత్తిపోతల పథకం, వెల్గటూర్ చెరువు, స్తంభంపల్లి, రంగదామంపల్లి, యశ్వంతరావుపేట చెరువు కూడికతీత పనులు పూర్తి చేసి నియోజకవర్గంలో ని ప్రతి ఎకరాకు సాగునీటి ని అందిస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రైతుల ప్రయోజన మే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమైందని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించి అంచనాలు పెంచి మధ్యలోనే నిలిపివేశారని మంత్రి ఆరోపించారు. నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందించే రోళ్ల వాగు ప్రాజెక్ట్ భూ సేకరణ చేయకుండానే పనులు ప్రారంభించారని మంత్రి అన్నారు. రోళ్లవాగు ప్రాజెక్ట్ విషయంలో ధర్మపురి మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ రూ. 60 కోట్ల అంచనాలతో 2016లో ప్రారంభించి రూ. 140 కోట్లకు పెంచారని మంత్రి ఆరోపించారు. అంచనాలు ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదో మాజీ మంత్రి కొప్పుల సమాధానం చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# పోసాన్ పల్లి గ్రామంలో శ్రీ బీరప్ప - కామరతి కల్యాణ మహోత్సవం

* కన్నుల పండుగగా కల్యాణం
* వేలాదిగా తరలివచ్చిన భక్తులు
* బీరప్ప స్వామి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి
* కురుమ సంఘం నాయకులు





సిద్దిపేట , ఏప్రిల్ 20(భరత శక్తి ): సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం పోసాన్ పల్లి గ్రామంలో కురుమ కులస్తుల సంఘం ఆధ్వర్యంలో శ్రీ బీరప్పకామరతి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు, ఈ కార్యక్రమం పొసన్ పల్లి కురుమ సంఘం అధ్యక్షుడు పుల్ల రాయుడు, పెద్ద కుర్మ రాసురి మల్లయ్య, చిన్న కుర్మ పొన్న బుచ్చయ్య, పుల్ల కుమార్, జమున ముత్తయ్య నేతృత్వంలో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు, ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా మంద పోచమ్మ పూజ, మహిళ తీయుట, గద్దెగొర్రెను చేయుట, బియ్యం సుంకుపట్టుట, గంగకు పోవుట రాత్రి లగ్నం, బోనాలు తీయుట, బీరప్ప కామరాతి కళ్యాణం, మంద మీద సరుగు వేయుట, గావు పట్టుట, కాశి రామక్క కథ, గ్యారడి వేషం, ఎల్లమ్మ వేషం, సింగం రాత్రికి నాగవెళ్ళి బోనాలు, అక్క మహంకాళి బోగన్న బీరప్ప కామరాతి వేషాలు, గొర్ల లగ్గాలు, భయ్యన్నకు చేయుట, మైలలు తీయుట, రస్తు పంచుట, లాంటీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి వస్తు రూపేణా, దన రూపేనా సహాయం చేసిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పండుగను తిలకించడానికి వచ్చిన భక్తులకు, అలాగే గ్రామ ప్రజలపై మా కుల దేవుడు శ్రీ బీరప్ప ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోసాన్ పల్లి కురుమ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఇబ్బందులు లేకుండా వడ్ల కొనుగోలు చేపట్టాలి

- ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్



చిన్న కోడూరు, ఏప్రిల్ 20 (భారత శక్తి ) : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని మేడిపల్లి, చౌడరాం, ఎల్లమ్మజాలు, చెల్కలపల్లి గ్రామాల్లో ఎఫ్ఎస్సిఎస్ అల్లీపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులు, హమాలీలు, అధికారుల సమక్షంలో మాట్లాడిన ఆయన, వడ్ల కొనుగోలు ప్రక్రియలో గతంలో ఎదురైన సమస్యలు మళ్లీ రాకుండా జాగ్రత్తలు తీసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు నాగార్జున రెడ్డి, వాసుదేవ దేవా చారి, రేఖ సంతోష్, డైరెక్టర్లు పాకాల భూపతి రెడ్డి, సింగిరాల లక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదుగాని లహరి, నాయకులు గొట్టిపర్తి చంద్, మేడుపల్లి శ్రీకాంత్, వార్డ్ సభ్యులు గొట్టిపర్తి మౌనిక, రామకృష్ణ నవీన్, ఏఈవోలు, ఎఫ్ ఎస్ సిఎస్ సీఈఓ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలు

* బసవన్న విగ్రహానికి నివాళులర్పించిన రామ్మోహన్ గౌడ్*
* వనస్థలిపురం రైతు బజార్ వద్ద కార్యక్రమం



వనస్థలిపురం, ఏప్రిల్ 20 (భారత శక్తి) : మహాత్మా బసవేశ్వర 893వ జయంతి వేడుకలను వనస్థలిపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వనస్థలిపురం రైతు బజార్ సమీపంలో వీర శైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


* సమాజ సేవలో బసవన్న బాట..

అనంతరం రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. సమాజంలోని అసమానతలను తొలగించి, కులరహిత సమాజ స్థాపనకు బసవేశ్వరుడు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన బోధనలు నేటి తరానికి ఎంతో స్పూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం బసవేశ్వర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మానెగారి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు దీపావళి శ్రవణ్ కుమార్, కుషాల్ కుమార్, విజయ్ పాటిల్, సంతోష్ కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## శేరిపల్లి గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు

* వార్షికోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ యాదవ రెడ్డి
* కెసిఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామాలలో కుల సంఘాలకు నిధులు మంజూరు
* అమ్మవారి దివ్య ఆశీస్సులతో అందరూ బాగుండాలి
* ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి





గజ్వేల్, ఏప్రిల్ 20( భారత శక్తి ): పెద్దమ్మ తల్లి దయతో తెలంగాణ రాష్ట్రంలో అలాగే శేరిపల్లి గ్రామంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలు పుష్కలంగా పండాలని ఆ జగన్మాతను కోరుకున్నామని, గత బిఅరెస్ ప్రభుత్వంలో ఆలయ నిర్మాణలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేసి, ఎన్నో నిధులను మంజూరు చేసారని ఉమ్మడి మెదక్ ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శేరిపల్లి గ్రామంలో ముదిరాజుల కుల దైవం పెద్దమ్మ తల్లి ఆలయ త్రుతీయ వార్షికోత్సవం వేడుకలు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో, పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ నేతృత్వంలో ఘనంగా నిర్వహిస్తున్నారు, గ్రామ పెద్దల పిలుపు మేరకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి మెదక్ ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఎంతో మహిమాన్విత మైన దేవతా అని, ఆలయ ప్రాంగణంలో సుమారు మూడు లక్షల రూపాయలతో సీసీ పోయించామని, అలాగే శేరిపల్లి గ్రామం ప్రధాన కూడలిలో ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేయించామని, రాబోవు రోజుల్లో శేరిపల్లి గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఆలయ కమిటీ అధ్యక్షులు మోతేకాని కుమార్, శేరిపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మోతేకాని శ్రీరామ్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం రోజున గ్రామ దేవత పోచమ్మ తల్లికి, బోనాలు సమర్పించామని, సోమవారం రోజు పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా జరిపామని, మహిళా మణులచే అమ్మవారికి ఒడి బియ్యం పోయాడం జరిగిందని, అలాగే ఇదే రోజున పెద్దమ్మ తల్లికి బోనాల సమర్పిస్తామని, మంగళవారం రోజున అమ్మవారికి గావురంగాల కార్యక్రమంలో ఉంటుందని తెలిపారు, పెద్దమ్మ తల్లి దయతో గ్రామంలో వర్షాలు సంవృద్ధి గా కురిసి పాడి పంటలు పుష్కలంగా పండాలని ఆ జగన్మాతను కోరుకున్నామని తెలిపారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు ఆర్దిక రూపేణా, వస్త్రా రూపేణా సహకరించిన దాతలకు, ముదిరాజ్ కులస్తులకు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కర్రె కనకయ్య, ప్రధాన కార్యదర్శి జిన్నా చంద్రం, కోశాధికారి బోయిని నర్సింలు, ముదిరాజ్ సంఘ నాయకులు, కులస్తులు, గ్రామ యువకులు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు అరెస్టు

* మూడు లక్షల విలువ గల ఐదు కేజీల గంజాయి స్వాధీనం
* నిందితులు ఉపయోగించిన కారు బైక్ నాలుగు సెల్ ఫోన్స్ సీజ్
* కేసు వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ




సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 20: సోమవారం రోజున నమ్మదగిన సమాచారంపై ఆత్మకూరు గ్రామ శివారులో క్రషర్ మిల్లు వద్ద నలుగు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారని సమాచారం రాగా వెంటనే ఆత్మకూరు పోలీసులు అక్కడికి చేరుకుని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. వీరిని విచారించగా నిమ్మికలకు చెందిన ఏ1 విరబోయిన భరత్ జాజిరెడ్డిగూడెం కొమ్మాల గ్రామానికి చెందిన ఏ2 అరే విజయ్, సూర్యాపేట రూరల్ ఆరెగూడెం గ్రామానికి చెందిన ఏ3 చెవుల మనోజ్, నిమికల్ గ్రామానికి చెందిన ఏ4 కొడిదల శివ గా గుర్తించడం జరిగింది. వీరిని తనిఖీ చేయగా వీరి వద్ద 5 కేజీల గంజాయి, ఒక కారు, ఒక బైక్, నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితులు జలసాలకు విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలని ఆలోచనతో గంజాయి వినియోగించే అలవాటు ఉండడం తో గంజాయిని తెచ్చి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం భరత్, విజయ్, మనోజ్ ముగ్గురు కలిసి కొడిదల శివ కు చెందిన మోటార్ సైకిల్ పై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సీలేరు వెళ్లి సీలేరు ఏరియాలో గంజాయిని కొనుగోలు చేసి తెచ్చారు. ఈ కొనుగోలు చేస్తే తెచ్చిన గంజాయిని పంచుకోవడం కోసం నలుగురు ఆత్మకూరు ఎస్ గ్రామ శివారు క్రషర్ మిల్ వద్దకు రావడం జరిగింది. నమ్మదగిన సమాచారం అందుకున్న ఆత్మకూరు ఎస్ మండల పోలీసులు అక్కడికి చేరుకుని నిందితులను అదులుకోకు తీసుకొని వారి నుండి గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగింది అని ఎస్పీ నరసింహ తెలిపారు. ఇద్దరూ పంచుల సమక్షంలో పంచనమా నిర్వహించి ఐదు కిలోల గాంజాయని మనోజ్ యొక్క కారును, శివ యొక్క బైకును, సెల్ఫోన్లను సీజ్ చేయడం జరిగింది అన్నారు. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమాలు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా గంజాయి నిర్మూలన గంజాయి వినియోగంపై ప్రజలను యువతను చైతన్యవంతం చేస్తున్నామని అయినప్పటికీ ఇలాంటి నిందితుల వల్ల గంజాయి సరఫరా అవుతుందని వీరిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డ్రగ్స్ గాంజా ఇలాంటి వాటికి అలవాటు పడకూడదని కోరారు. డ్రగ్స్ గంజాయి లాంటి వాటికి సంబంధించిన సమాచారాన్ని పోలీసువారికి తెలియజేయాలని అన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో బాగా పనిచేసిన సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ ను ఆత్మకూరు ఎస్సై శ్రీకాంత్ ను పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.మీడియా సమావేశం నందు సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఆత్మకూరు ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాల మెరుగుదల లక్ష్యంగా విద్య బోధన సాగాలి

: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20(భారత శక్తి): ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక” సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా, సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామంలో గల ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. స్టోర్ రూమ్ తనిఖీ చేశారు. ఫుడ్ కమిటీ లో సభ్యులుగా ఉన్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ, వారికి అందిస్తున్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల ముడిసరుకుల గడువు వివరాలు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆహార పదార్థాల గడువు తేదీ రిజిస్టర్లలో తప్పనిసరి నమోదు చేసి, ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ ఉండాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న విద్య గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారితో పాఠాలు చదివిపించారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి విషయంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. “ప్రజాపాలనప్రగతి ప్రణాళిక” లో భాగంగా వసతి గృహాల్లో సంక్షేమ వారోత్సవాలు సమర్థవంతంగా చేపట్టాలని వివరించారు. అవసరమైన చిన్న చిన్న రిపేర్లకు సంబంధించిన పనులు చేపట్టాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.



అనంతరం గ్రామంలోని లబ్ధిదారురాలు సుల్తానా కు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నందున లబ్ధిదారు కుటుంబ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. తనకు ఇందిరమ్మ ఇంటిని కట్టించినందుకు ప్రభుత్వానికి లబ్ధిదారురాలు కృతజ్ఞతలు తెలిపారు. తన సొంత ఇంటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో భోజన్న, డిటిడిఓ అంబాజీ, తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మికాంత రావు, ఎంపీఓ అజీజ్ ఖాన్, గ్రామ సర్పంచ్ మల్లేష్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ మహోత్సవాలు

* కన్నుల పండుగగా అమ్మవారి కల్యాణం
* గ్రామ దేవతకు వైభవంగా బోనాల సమర్పణ
* వార్షికోత్సవానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు
* ముదిరాజ్ సంఘ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 20 (భారత శక్తి) : పెద్దమ్మ తల్లి దయతో గ్రామంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలు పుష్కలంగా పండాలని ఆ జగన్మాతను కోరుకున్నామని వెంకటాపూర్ అగ్రహారం గ్రామ సర్పంచ్ అమ్మ పురం వెంకటేష్ అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ (అగ్రహారం) గ్రామంలో ముదిరాజుల కుల దైవం పెద్దమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం వేడుకలు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో, కులపెద్ద, గ్రామ సర్పంచ్ అమ్మపురం వెంకటేష్ నేతృత్వంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకటేష్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు,



ఆలయ అర్చకులు, మాట్లాడుతూ ఆదివారం రోజున పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా జరిపామని, ఈ రోజు గ్రామ దేవత పోచమ్మ తల్లికి, పెద్దమ్మ తల్లికి బోనాల సమర్పిస్తామని, మంగళవారం రోజున అమ్మవారికి గావురంగాల కార్యక్రమంలో ఉంటుందని తెలిపారు. పెద్దమ్మ తల్లి దయతో గ్రామంలో వర్షాలు సంవృద్ధి గా కురిసి పాడి పంటలు పుష్కలంగా పండాలని ఆ జగన్మాతను కోరుకున్నామని తెలిపారు, ఈ వార్షికోత్సవా వేడుకలకు ఆర్థిక రూపేణా, వస్తూ రూపేణా సహకరించిన వెంకటాపూర్ అగ్రహారం ముదిరాజ్ కుల బాంధవులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు, గ్రామ యువకులు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వరుడు

* కొనియాడిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 20 (భారత శక్తి): సమాజంలో కుల వ్యవస్థ, వర్ణ వివక్ష, లింగ వివక్షలను గట్టిగా వ్యతిరేకించిన అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వరుడు అని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కొనియాడారు. సోమవారం వనస్థలిపురంలోని సంపూర్ణ డబల్ బెడ్ రూమ్ వద్ద వనస్థలిపురం వీరశైవ లింగయత్ సమాజం అధ్యక్షులు దీపావళి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వారి 893వ జయంతి ఉత్సవాల సందర్భంగా బసవేశ్వరుడు విగ్రహానికి



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, వారు 1134 సంవత్సరంలో కర్ణాటక రాష్ట్రంలోని బాగేవాడిలో మాదిరాజు, మాదలంబిక దంపతులకు బసవేశ్వరుడు జన్మించారని తెలిపారు. వేద పండితుల కుటుంబంలో జన్మించిన ఆయన, కళ్యాణ రాజధానిలో ప్రధానమంత్రిగా పనిచేసి సమాజ సేవలో విశేష పాత్ర పోషించారని చెప్పారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బసవేశ్వరుడు చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, అంటరానితనాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. వీరశైవ ధర్మాన్ని ప్రచారం చేసి, మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు కృషి చేశారని వివరించారు. ఇట్టి కార్యక్రమంలో చింతల రవికుమార్, ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్, కిరణ్ కుమార్, నాయకులు సంఘ సభ్యులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బల్వంతపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

దుబ్బాక, ఏప్రిల్ 20 (భారత శక్తి) : పేదల ఇళ్ల కల సాకారం కాంగ్రెస్ తోనే సాధ్యమని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక మండలం బల్వంతపూర్ గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరై గృహ యజమానులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదల ఇళ్ల కల సాకారం అవుతోందని పేర్కొన్నారు. ఇలాంటి పథకాలు సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, డైరెక్టర్ నరేందర్ రెడ్డి, మట్ట కిషన్



రెడ్డి, రేకులకుంట డైరెక్టర్ చిట్యాల ధనుంజయ, చీకోడ్ సర్పంచ్ నరేష్, సాయి తేజ గౌడ్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# మహిళా సాధికారతే లక్ష్యం: డీసీ శ్రీనివాస్

సరూర్ నగర్, ఏప్రిల్ 20 (భారత శక్తి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా సంఘాలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే కార్యక్రమం సోమవారం వెంకటేశ్వర కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. సరూర్ నగర్, ఎల్బీనగర్ సర్కిళ్ల పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. ప్రధానంగా...

* ఆర్థిక భరోసా: ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, కొత్త పొదుపు సంఘాల ఏర్పాటు, వడ్డీ లేని రుణాల పంపిణీపై అవగాహన కల్పించారు.
* సంక్షేమ పథకాలు: ఆరు గ్యారంటీలు, న్యూట్రిషన్ కిట్లు, సన్న బియ్యం పంపిణీ,



ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన గురించి వివరించారు.
* నైపుణ్యాభివృద్ధి: మహిళల కోసం ప్రత్యేకంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలను ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో యూసీడీ సిబ్బంది జి.సహదేవ్, బెల్లి సైదులు, వి.శోభన, డి.కృష్ణవేణి, నర్సింగ్ రావుతో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా పంచముఖ ఆంజనేయ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

కాప్రా, ఏప్రిల్ 20 (భారతశక్తి): కాప్రా ప్రాంతంలోని చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో 14 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించబడిన శ్రీ జయమంగళ పంచముఖ ఆంజనేయ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయబడింది. కార్యక్రమం మొత్తం భక్తి భావంతో, సంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా జరిగింది. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంలో సోలిస్ కంటి ఆసుపత్రి చైర్మన్ నందనంపాటి రామాంజనేయులు ఆలయంలో జరిగే కార్యక్రమాల కోసం వంట సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్



శివమణి స్వర్ణరాజ్, మాజీ కార్పొరేటర్ కొత్త రామా రావు, జె. కృష్ణమాచార్యులు, ఈ.ఓ., కమిటీ సభ్యులు పొట్టు బాబురావు, పడమటి మల్లారెడ్డి, ఉప్పల వినోద్ కుమార్, ఓర్ల శ్రీధర్ రెడ్డి, గూడ సత్యనారాయణ, పబ్బారి నరేందర్ గౌడ్, దేవాలయ జూనియర్ అసిస్టెంట్ టి.శ్రీనివాస్, శంకర్ బాబు, గజేందర్ రెడ్డి, ముకేష్, మోహన్, విశ్వం, విజయెందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 21.04.2026 సుదర్శన హోమం, చక్ర స్నానం మరియు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయని తెలియజేశారు.



# ప్రజావాణికి 62 ఫిర్యాదులు

* జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వినతుల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 20 (భారత శక్తి) : నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. కమిషనర్ ఆర్.వి. కర్ణన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు సత్యనారాయణ, రవి కిరణ్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, సిటీ ప్లానర్ శ్రీనివాస్ తదితర విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

**అధికంగా ప్రధాన కార్యాలయానికే..**

ఈ రోజు జరిగిన కార్యక్రమంలో మొత్తం 62 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా ప్రధాన కార్యాలయానికి సంబంధించి 35 వినతులు రాగా, జోన్ల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి:

* శంషాబాద్ జోన్: 12
* సికింద్రాబాద్ జోన్: 09
* రాజేంద్రనగర్, గోల్కొండ జోన్లు: చెరి 02
* చార్మినార్, ఖైరతాబాద్ జోన్లు: చెరి 01

* త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశం

ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత విభాగాల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ ఆదేశించారు. ముఖ్యంగా భూసేకరణ, పట్టణ ప్రణాళిక (సిటీ ప్లానింగ్), పారిశుధ్యం మరియు ఇంజనీరింగ్ పనులకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, బాధితులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్లు జయంత్, రాజనీకాంత్ రెడ్డి, యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, భూసేకరణ విభాగం అధికారిణి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధి

* తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్‌కు తొలి ప్రాధాన్యం
* క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు పర్యవేక్షించాలి
* అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 20 (భారత శక్తి): ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ పంపిణీ, పారిశుధ్యం వంటి అంశాల్లో అధికారులు ఏమాత్రం అలసత్వం వహించకూడదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన సూచించారు.

**వేసవిలో ఇబ్బందులు కలగకూడదు**

ప్రస్తుత ఎండల దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఎద్దడి కలగకుండా నిర్ణీత సమయాల్లో నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యంలో లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా డిమాండ్‌కు అనుగుణంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. జలమండలి పరిధిలో నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం ఇప్పటికే ఎండీ అశోక్ రెడ్డితో చర్చించామని, నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

*** రూ. 75 కోట్లతో అభివృద్ధి పనులు**

నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలకు మంజూరైన రూ. 75 కోట్ల అభివృద్ధి పనులకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అమీన్‌పూర్ పరిధిలో రూ. 23 కోట్లతో 55 పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలోని 9 డివిజన్లలో కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని, ముఖ్యంగా నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మున్సిపల్ పార్కుల సుందరీకరణ కోసం రూ. 10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

**ప్రజల అభిప్రాయమే ముఖ్యం**

పట్టణీకరణ వేగంగా జరుగుతున్న తరుణంలో ప్రభుత్వ భూముల రక్షణ బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల ఆమోదం మేరకే పరిశ్రమలకు భూములు కేటాయించాలని, అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లేదా పరిశ్రమలకు కట్టబెడితే సహించేది లేదని హెచ్చరించారు. అమీన్‌పూర్ సర్వే నం. 993లో ఎస్టీపీ ఏర్పాటుపై ప్రజల అభ్యంతరాల మేరకు పది ఎకరాల భూమి కేటాయింపును రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు ఆయన తెలిపారు.

*** కీలక నిర్ణయాలు.. పరిష్కారాలు**

* విద్యాసంస్థలు: నల్తూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను వేగవంతం చేయాలి. అమీన్‌పూర్ పరిధిలో నవోదయ పాఠశాలకు భూమి కేటాయింపు పూర్తయిందని, పాలిటెక్నిక్ కళాశాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.
* కాలుష్య నివారణ: గడ్డపోతారం పరిధిలోని అయ్యమ్మ చెరువు కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటుకు కసరత్తు మొదలుపెట్టామన్నారు.
* నిర్మాణ అనుమతులు: మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో (గ్రామ కంఠం) ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు.
* పటాన్‌చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని, నిధుల సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సూచించారు.

# ఇస్నాపూర్ మల్లన్న స్వామి జాతర్లు పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్‌చెరు, ఏప్రిల్ 20 (భారత శక్తి) : ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలో గల మల్లన్న స్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేతంగా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, శ్రీ కామరతి సమేత బీరప్ప స్వామి కళ్యాణం, జాతర మహోత్సవంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కురుమ సంఘం ఆధ్వర్యంలో



ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత,



కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గులాబీ గూటికి జీవన్ రెడ్డి..వెంటనే కీలక బాధ్యతలు!

హైదరాబాద్, ఏప్రిల్ 20(భారత శక్తి): బీఆర్ఎస్ పార్టీలో చేరిన జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డికి పార్టీ అధినేత కేసీఆర్ కీలక పదవిని ప్రకటించారు. జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. జగిత్యాలలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు ప్రయోజనాల కోసం ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరారని అన్నారు. రాజకీయాల్లో ఎందరికో ఆదర్శంగా నిలిచిన వ్యక్తి జీవన్ రెడ్డి అన్నారు. భిన్న రాజకీయ వేదికల కారణంగా వేర్వేరుగా పనిచేశామని, వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ తామిద్దరం మంచి స్నేహితులమని తెలిపారు. ఇద్దరం కలిసి ఎంతో పని చేశామని, నాలుగున్నర దశాబ్దాలుగా తాము స్నేహితులమేనని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీవన్ రెడ్డి తనను కలిసి ఒక బ్రిడ్జి అడిగారని గుర్తు చేసుకున్నారు. ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరితే అన్ని నియోజకవర్గాల్లో ఆ ప్రభావం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఆయనకు పదవులు కొత్తకాదని, నికార్సైన వ్యక్తి అని కేసీఆర్ అన్నారు. అన్నదమ్ముల్లా కలిసి పనిచేద్దామని ఆయనకు చెప్పానని, ఇక నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాధ్యతలు ఆయన భుజాల పైనే పెడతానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే జీవన్ రెడ్డికి బ్రహ్మాండమైన పదవి వస్తుందని తెలిపారు. జగిత్యాల యుద్ధం మీ వంతు తెలంగాణ యుద్ధం మా వంతు అన్నారు. ఒకప్పుడు తెలంగాణ భయంకరమైన పరిస్థితుల్లో ఉండేదని, తాము ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ ఏమీ మాట్లాడలేని పరిస్థితి ఉండేదని అన్నారు. అసెంబ్లీలో తెలంగాణ అనే పదాన్ని నిషేధించిన రోజులు ఉండేవని అన్నారు. మన బతుకు, మన భాష, మన ఉద్యోగాల మీద దాడి జరిగేదని అన్నారు. హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు వస్తే బషీర్‌బాగ్ కాల్పులు జరిపారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తాను బయలుదేరితే అవహేళనలు చేశారని అన్నారు.

## జగిత్యాల సభకు హరీశ్ దూరం వ్యూహాత్మకమేనా?

చాలా రోజుల విరామం తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఆయన ఇవాళ జగిత్యాలలో నిర్వహించనున్న 'బీఆర్ఎస్ ఆశీర్వాద సభ'లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఇందుకోసం సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి ఆయన బయలుదేరనున్నారు. అయితే, పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ సభకు కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గైర్హాజరు కావడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ ముఖ్య నేతలంతా జగిత్యాల సభ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా, హరీశ్ రావు మాత్రం పార్టీ నేతలు బి. వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్రతో కలిసి హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కేసీఆర్ సభ జరుగుతున్న రోజే ఈ కీలక నేతలు ఢిల్లీకి వెళ్లడం వెనుక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రెండు కీలకమైన న్యాయపరమైన అంశాలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించేందుకే ఈ పర్యటన చేపట్టినట్లు పార్టీ వర్గాల సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ పూర్తిచేసిన ధర్మాసనం, ఈ నెల 22న తుది తీర్పును వెలువరించనుంది. ఒకవేళ తీర్పు ప్రతికూలంగా వస్తే వెంటనే సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ముందస్తుగా న్యాయవాదులతో మంతనాలు జరిపేందుకు హరీశ్ రావు బృందం ఢిల్లీకి వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో స్పీకర్ తీర్పు అనంతరం చేపట్టాల్సిన న్యాయపరమైన కార్యాచరణపై కూడా ఈ పర్యటనలో చర్చిస్తున్నట్లు సమాచారం. ఓవైపు కేసీఆర్ బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తుండగా, మరోవైపు కీలక నేతలు న్యాయపోరాటాలకు సిద్ధం కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జగిత్యాల సభను విజయవంతం చేసేందుకు కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు భారీగా జన సమీకరణ చేపట్టారు.

## 100 పర్సంటైల్తో అదరగొట్టిన తెలుగు తేజాలు!

హైదరాబాద్, ఏప్రిల్ 20(భారత శక్తి): ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ 2026 సెషన్2 తుది విడత ఫలితాలు విడుదలయ్యాయి. జాతీయ పరీక్షా సంస్థ (ఎన్టీఏ) సోమవారం సాయంత్రం ఈ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన 26 మందిలో 10 మంది తెలుగు విద్యార్థులే ఉండటం విశేషం. ఎన్టీఏ సోమవారం మధ్యాహ్నం ఫైనల్ ఆన్సర్ కీని విడుదల చేసి, సాయంత్రానికి ఫలితాలను ప్రకటించింది. విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్ వివరాలతో jeemain.nta.nic.in వెబ్‌సైట్‌లో స్కోర్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

*** 100 పర్సంటైల్ సాధించిన తెలుగు విద్యార్థులు**

- జొన్నల రోషన్ మణిదీప్ రెడ్డి (ఏపీ)
- మంతా శివ కామేశ్ (తెలంగాణ)
- నరేంద్ర బాబు గారి మహిత్ (ఏపీ)
- తుంగ దుర్గ సుప్రభాత్ (ఏపీ)
- డి. భవితేష్ రెడ్డి (తెలంగాణ)
- పసల మోహిత్ (ఏపీ)
- సాయి రిత్విక్ రెడ్డి (తెలంగాణ)
- వివాన్ శరద్ మహేశ్వరి (తెలంగాణ)
- బిజ్జం వెంకట చంద్ర శేఖర్ రెడ్డి (ఏపీ)
- రిషి ప్రేమ్‌నాథ్ (తెలంగాణ)

జేఈఈ మెయిన్ రెండు సెషన్లలో కలిపి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 2.50 లక్షల మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 పరీక్ష రాసేందుకు అర్హత సాధించారు. ఈ పరీక్ష మే 17న జరగనుంది. అడ్వాన్స్‌డ్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఏప్రిల్ 23 నుంచి మే 4 వరకు కొనసాగుతుంది. ఈ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి దేశంలోని ప్రఖ్యాత ఐఐటీలలో ప్రవేశాలు లభిస్తాయి.

## కాళేశ్వరం ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం


హైదరాబాద్, ఏప్రిల్ 20(భారత శక్తి): కాళేశ్వరంలోని ఆలయ అభివృద్ధి పనులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి తొలుత కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుని, ఎన్డీఎస్ఏ ఛైర్మన్ అనిల్ జైన్‌తో కలిసి బ్యారేజీని పరిశీలిస్తారు. ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారు. అక్కడి నుంచి కాటారం మండలం నస్తూరిపల్లికి వెళ్తారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారు. ఈ సభలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా రెండో విడత నిధులను విడుదల చేస్తారు.

## భారత్ కొరియా సరికొత్త బంధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (భారత శక్తి) ప్రతి రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారతదేశానికి వచ్చారు. ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా ప్రధాని మోదీ, లీ జే మ్యూంగ్ సమక్షంలో పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, చిప్స్ నుంచి షిప్స్ వరకు, టాలెంట్ నుంచి సాంకేతిక వరకు, ఎంటర్‌టైన్మెంట్ నుంచి ఎనర్జీ వరకు ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాల విలువ 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు.

## ఐటీ హబ్ నిర్మాత బాబు: ఎంపీ అరవింద్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం తన 76వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు రాజకీయ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా తీర్చిదిద్దింది చంద్రబాబేనని ఆయన కొనియాడారు. చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ అరవింద్ ఒక పోస్ట్ చేశారు. "1990లలోనే చంద్రబాబు స్పష్టమైన విజన్‌తో పనిచేశారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లను ప్రణాళికాబద్ధంగా విస్తరించి, తెలుగు యువతను ప్రపంచ ఐటీ రంగానికి పరిచయం చేశారు," అని అరవింద్ ప్రశంసించారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముందుచూపుతో తీసుకున్న నిర్ణయాలను ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించి, లక్షలాది ఉద్యోగాలకు మార్గం సుగమం చేశారని తన పోస్టులో అరవింద్ పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వ పటిమ, దార్శనికత వల్లే హైదరాబాద్ నేడు ఈ స్థాయిలో ఉందని అభిప్రాయపడ్డారు.



## జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం

జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. ఉత్తర జపాన్‌లో రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో భూప్రకంపనలు వచ్చాయి. దీనితో అధికారులు తీర ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతంలో మూడు మీటర్ల మేర అలలు ఎగిసిపడవచ్చని జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4.54 గంటలకు ఉత్తర జపాన్‌లో సన్రికు ప్రాంతంలో భూకంపం సంభవించింది. సముద్రమట్టం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. తీర ప్రాంత ప్రజలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు సురక్షిత ప్రాంతాల్లో, ఎత్తైన ప్రదేశాల్లోనే ఉండాలని అధికారులు పౌరులకు సూచించారు. జపాన్ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా భూకంపాలు సంభవించే దేశాల్లో ఒకటి. సాధారణంగా ప్రతి సంవత్సరం దాదాపు 1,500 వరకు భూకంపాలు సంభవిస్తాయి.

## అమ్మల కోసం..
# సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ చిట్కాలు!

**కొత్తగా తల్లైన మహిళలు ఓవైపు తాము కోలుకుంటూనే.. మరోవైపు తమ బిడ్డ ఎదుగుదల పైనా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చనుబాలు ఎక్కువగా ఉత్పత్తయ్యే ఆహారానికి ప్రాధాన్యమివ్వాలి. అందులోనూ బిడ్డ పుట్టాక తొలి 40 రోజులు తీసుకునే ఆహారం కీలకమంటున్నారు ప్రముఖ సెలబ్రిటీ పోషకాహార నిపుణురాలు సుమన్ అగర్వాల్. ఈ సమయంలో కొన్ని పదార్థాల్ని రోజువారీ మెనూలో భాగం చేసుకుంటే తల్లిపాలు ఎక్కువగా పడే అవకాశం ఉందంటున్నారు. ఈ క్రమంలో బాలీవుడ్ నటి, రచయిత్రి సోహా అలీ ఖాన్ ఇటీవలే నిర్వహించిన పాడ్‌కాస్ట్ షోలో భాగంగా కొత్తగా తల్లైన మహిళల కోసం ఆమె కొన్ని చిట్కాలందించారు.**

### తొలి నలభై రోజుల్లో..

బాలీవుడ్ నటి, రచయిత్రి సోహా అలీ ఖాన్ 'ఆల్ అబౌట్ హర్' పేరుతో తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ పాడ్‌కాస్ట్ షో నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన తాజా ఎపిసోడ్‌లో ప్రముఖ సెలబ్రిటీ పోషకాహార నిపుణురాలు సుమన్ అగర్వాల్ పాల్గొన్నారు. కొత్తగా తల్లైన మహిళలు చనుబాలు ఉత్పత్తయ్యేందుకు తీసుకోవాల్సిన కొన్ని పదార్థాల గురించి ఆమె తెలియజేశారు. 'బాలింతలకు సంబంధించి పూర్వకాలం నుంచి మన దేశంలో కొన్ని ఆహార పద్ధతులు అమల్లో ఉన్నాయి. మన పెద్దలు చెప్పినట్లు బిడ్డ పుట్టాక తొలి నలభై రోజుల్లో కొన్ని పదార్థాలు తీసుకోవడం వల్ల తల్లుల్లో పాల ఉత్పత్తి అధికమవుతుంది. ఇది బిడ్డకూ మేలు చేస్తుంది..' అంటున్నారు సుమన్.



### వాము.. ఇలా!

చనుబాల ఉత్పత్తిని పెంచడంలో వామును మించింది లేదంటున్నారు సుమన్. డెలివరీ తర్వాత మహిళలు తొలి పది రోజులు దీన్ని రోజూ తీసుకోవడం వల్ల త్వరగా కోలుకోవచ్చంటున్నారు. 'ప్రసవం తర్వాత మహిళలు కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి, త్వరగా కోలుకోవడానికి వాము ఉపయోగపడుతుంది. డెలివరీ అనంతరం తొలి పది రోజులు దీన్ని తీసుకోవడం వల్ల చనుబాల ఉత్పత్తి పెరుగుతుంది. గర్భాశయం తిరిగి పూర్వపు స్థితికి చేరుకుంటుంది. శరీరంలోని విషపదార్థాల్ని ఇది బయటికి పంపించేస్తుంది. ఇందుకోసం వామును కాస్త నలిపి లేదా బరకగా చేసుకొని.. దీన్ని నెయ్యి, గోంధ్, కాస్త బెల్లంతో కలిపి తీసుకోవాలి. ముఖ్యంగా అల్పాహారానికి మధ్యాహ్న భోజనానికి మధ్యలో లేదంటే సాయంత్రం స్నాక్స్ సమయంలో తీసుకుంటే మెరుగైన ఫలితాలుంటాయి..' అంటున్నారు సుమన్.

### గోంధ్ లడ్డూలు

అలాగే ప్రసవానంతరం శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి, ఎముకల దృఢత్వానికి గోంధ్ మేలు చేస్తుందంటున్నారు సుమన్. 'గోంధ్‌లో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చనుబాల ఉత్పత్తిని రెట్టింపు చేస్తాయి. ప్రసవ సమయంలో శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి, ఎముకల దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి దీన్ని తీసుకోవడం ముఖ్యం. నెయ్యి, నట్స్, సహజసిద్ధ తీపి పదార్థాలతో దీన్ని కలిపి తయారుచేసిన లడ్డూల్ని తీసుకుంటే ఫలితం ఉంటుంది..' అంటున్నారామె.


### జీర్ణశక్తికి.. మెంతులు!

ప్రసవం తర్వాత కడుపుబ్బరం, గ్యాస్ట్రిక్.. వంటి జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తడం సహజమే. ఇలాంటప్పుడు మెంతులు మేలు చేస్తాయంటున్నారు సుమన్. 'డెలివరీ తర్వాత మెంతుల్ని ఆహారంలో చేర్చుకుంటే త్వరగా కోలుకోవచ్చు. ఇవి రక్తంలోని చక్కెర స్థాయుల్ని క్రమబద్ధీకరించడంతో పాటు జీర్ణశక్తిని పెంచుతాయి. ఫలితంగా ఈ సమయంలో వచ్చే జీర్ణ సంబంధిత సమస్యలు దూరమవుతాయి. అలాగే ఇవి చనుబాల ఉత్పత్తినీ పెంచుతాయి. కాబట్టి వీటిని రోజువారీ కూరల్లో భాగం చేసుకోవచ్చు.. లేదంటే పొడి చేసుకొని గోంధ్ లడ్డూల తయారీలోనూ వాడచ్చు..' అంటూ సలహా ఇస్తున్నారామె. వీటితో పాటు ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్.. వంటి పోషకాలు కూడా కొత్తగా తల్లైన మహిళలకు అవసరం అంటోన్న సుమన్.. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడమూ ముఖ్యమంటున్నారు. తద్వారా తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉండచ్చని చెబుతున్నారు.

### అంబానీల న్యూట్రిషనిస్ట్!

ఆక్స్‌ఫర్డ్‌లో న్యూట్రిషన్ కోర్సు చేసిన సుమన్.. ప్రముఖ పోషకాహార నిపుణురాలిగా, ఫుడ్ గురూగా, ఫిట్‌నెస్ నిపుణురాలిగా పేరు గాంచారు. తన పాతికేళ్ల సుదీర్ఘ కెరీర్‌లో దేశవిదేశాల్లో ఎంతోమందిలో ఆరోగ్య స్పృహ పెంచిన ఆమె.. అంబానీ, బిర్లా.. వంటి ప్రముఖ వ్యాపార దిగ్గజ కుటుంబాలకు వ్యక్తిగత న్యూట్రిషనిస్ట్‌గా వ్యవహరించారు. అలాగే ఆలియా భట్, అనన్యా పాండే, సోనాక్షీ సిన్హా.. వంటి బాలీవుడ్ తారలకూ ఆరోగ్యకరమైన ఆహార చిట్కాలు అందించారు. ప్రస్తుతం 'సెల్ఫ్‌కేర్' అనే సంస్థను స్థాపించి.. ఈ వేదికగా ఎంతోమందికి ఆరోగ్యకరమైన జీవనశైలిని చేరువ చేస్తున్నారామె. ఆహారం ఆరోగ్యకరమైన వంటకాలపై మక్కువతో పలు పుస్తకాలు రాసిన ఈ సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్.. 'అపరాజిత' వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలూ అందుకున్నారు. ప్రస్తుతం ఈమె ఇన్‌స్టా పేజీకి 1.68 లక్షల మంది ఫాలోవర్లున్నారు.

# అక్షర వ్యాపారం.. ఫీజుల 'వేట'!




హైదరాబాద్ ఏప్రిల్ 20 (భారత శక్తి): రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలు మితిమీరుతున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చిన ఎస్సార్ గాయత్రీ జూనియర్ కళాశాలల యాజమాన్యం, నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోంది. ఒకవైపు బోధనా ప్రమాణాలు పాటించక విద్యార్థులు పరీక్షల్లో విఫలమవుతుంటే, మరోవైపు సప్లమెంటరీ పరీక్ష ఫీజులను పాత బకాయిలతో ముడిపెట్టి వేధింపులకు గురిచేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**బకాయిలు ఉంటే ఫీజు తీసుకోబోం**

పరీక్షా ఫీజు చెల్లించేందుకు శనివారం గడువు ముగియనుండటంతో విద్యార్థులు కళాశాలలకు క్యూ కట్టారు. అయితే, "కళాశాల ఫీజు బకాయిలు ఉంటే సప్లమెంటరీ ఫీజు తీసుకోబోం" అంటూ యాజమాన్యం ఖరాకండిగా చెప్పడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఫలితాలు ఆశాజనకంగా లేక ఇప్పటికే మానసిక వేదనలో ఉన్న విద్యార్థులపై, ఈ ఫీజుల వేధింపులు 'మూలిగే నక్కపై తాటికాయ' పడ్డ చందంగా మారాయి. ఎక్కడా లేని విధంగా పరీక్ష ఫీజును కాలేజీ ఫీజుతో ముడిపెట్టడం చట్టవిరుద్ధమని విద్యావేత్తలు మండిపడుతున్నారు.

ప్రమాణాలు శూన్యం.. వసూళ్లు అమోఘం!

వేలాది రూపాయల ట్యూషన్ ఫీజులు, మెటీరియల్స్ పేరుతో అందినకాడికి దండుకుంటున్న ఈ విద్యాసంస్థలు, కనీసం ఉత్తీర్ణత సాధించే స్థాయిలో కూడా బోధన అందించడం లేదని తల్లిదండ్రులు ధ్వజమెత్తుతున్నారు.

* మౌలిక సదుపాయాల కొరత: అధిక ఫీజులు వసూలు చేస్తున్నా తరగతి గదుల్లో కనీస సౌకర్యాలు లేవు.
* బోధనలో వైఫల్యం: అనుభవం లేని అధ్యాపకులతో పాఠాలు చెప్పించడం వల్ల విద్యార్థులు ఫెయిల్యూర్ల బాట పడుతున్నారు.
* ఒత్తిడి తంత్రం: ఫెయిలైన విద్యార్థులను ఆదుకోవాల్సింది పోయి, ఫీజుల కోసం వారిని మానసిక క్షోభకు గురిచేస్తున్నారు.

**చట్టం ఏం చెప్తోంది?**

భారత రాజ్యాంగంలోని అధికరణ 21ఏ ప్రకారం విద్య ఒక ప్రాథమిక హక్కు. తెలంగాణ విద్యా చట్టం ప్రకారం, ఏ విద్యాసంస్థ కూడా విద్యార్థుల పరీక్ష ఫీజును నిలిపివేసే హక్కు కలిగి లేదు.

> "ఫీజు బకాయిలు ఉంటే ధ్రువీకరణ పత్రాలు (TC, Marks Memo) ఇచ్చే సమయంలో వసూలు చేసుకోవచ్చు. కానీ, పరీక్ష రాయకుండా అడ్డుకోవడం ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ఉల్లంఘనే అవుతుంది."

* **కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ.***

**అధికారుల నిర్లక్ష్యంపై నిలదీత**

కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు, ఏ. సాయికుమార్ శనివారం కాలేజీ యాజమాన్యాలను నిలదీశారు. ప్రైవేట్ కళాశాలలపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు. విచ్చలవిడి ఫీజుల వసూళ్లపై, ప్రమాణాలు పాటించని విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, ఎస్సార్ గాయత్రీ వంటి కళాశాలల్లో



జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి, విద్యార్థులకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



# ప్రజావాణికి 48 దరఖాస్తులు

* **సమస్యలను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్ నారాయణ రెడ్డి**
* **వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశం**

రంగారెడ్డి, ఏప్రిల్ 20 (భారతశక్తి) : జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి వినతి పత్రాలు సమర్పించారు. మొత్తం 48 ఫిర్యాదులు అందగా, అందులో రెవెన్యూ విభాగానికి చెందినవి 8, ఇతర శాఖలకు సంబంధించినవి 40 దరఖాస్తులు ఉన్నాయి.

**పెండింగ్‌లో పెట్టొద్దు..**

ప్రజావాణిలో అందిన అర్జీలను ఆయా శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సామాన్య ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆశతో ఇక్కడికి వస్తారని, వారి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

**ధాన్యం సేకరణపై నజర్:**

అనంతరం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఎక్కడా ఆలస్యం చేయకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎండ తగలకుండా నీడ, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి (రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి (DRO) సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



108 అంబులెన్స్‌లో

# సుఖ ప్రసవం - సిబ్బందికి కృతజ్ఞతలు

సిద్దిపేట, ఏప్రిల్ 20 (భారత శక్తి) : సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామానికి చెందిన శ్రీనిక అనే గర్భిణీకి రెండవ కాన్పు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన మీరుదొడ్డి 108 సిబ్బంది ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో తొర్నాల గ్రామ సమీపానికి చేరుకునే సరికి పురిటి నొప్పులు తీవ్రంగా మారడంతో, అంబులెన్స్‌లోనే 108 సిబ్బంది టెక్నీషియన్ రాజశేఖర్ సకాలంలో స్పందించి సుఖ ప్రసవం నిర్వహించారు. శ్రీనిక పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉండగా, అనంతరం వారిని సమీపంలోని ప్రభుత్వ మాతాశిశు ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు 108



సిబ్బంది రాజశేఖర్, ఎల్లంలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# విధులకే అంకితం.. మృత్యువులో అనాథం!

* **ఆరోగ్యమిత్ర సంజీవరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్.**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (భారతశక్తి): రెండు దశాబ్దాల పాటు నిరుపేదల ఆరోగ్యమే తన బాధ్యతగా పనిచేసిన ఓ ఆరోగ్యమిత్ర కుటుంబం ఇప్పుడు వీధిన పడింది. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో దాదాపు 19 ఏళ్లుగా సేవలందించిన మెదక్ జిల్లా ఆరోగ్యమిత్ర సంజీవరెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆయన మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది.



**రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి**

సంజీవరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ వెంటనే ఆదుకోవాలని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య డిమాండ్ చేశారు. నిన్న ఆయన యూనియన్ ప్రతినిధులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ తరపున సేకరించిన *రూ. 92,000* ఆర్థిక సాయాన్ని అందజేశారు. సుదీర్ఘకాలం ప్రజలకు సేవలందించిన ఉద్యోగి చనిపోతే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

**చట్టపరమైన హక్కులు కల్పించాలి**

కార్మిక చట్టాల ప్రకారం సంజీవరెడ్డి కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలపై యూనియన్ నేతలు స్పష్టతనిచ్చారు:

* గ్రాట్యుటీ చెల్లింపు: పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ యాక్ట్ ప్రకారం 5 ఏళ్లకు పైగా పనిచేసిన ఉద్యోగికి సర్వీసు నిబంధనల మేరకు గ్రాట్యుటీ అందాలి.
* ఈపీఎఫ్ & ఇన్సూరెన్స్: ఈపీఎఫ్ (EPF) పరిధిలో ఉన్న ఉద్యోగి మరణిస్తే నామినీకి అందాల్సిన డెత్ బెనిఫిట్స్ (EDLI) వెంటనే మంజూరు చేయాలి.
* పెండింగ్ బకాయిలు: నిలిచిపోయిన వేతనాలు, సెలవుల నగదు రూపకల్పన (Leave Encashment) తక్షణమే చెల్లించాలి.

**పాల్గొన్న నేతలు**

ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు సుమన్, హైదరాబాద్ అధ్యక్షులు రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రత్నం, రాష్ట్ర కమిటీ సభ్యులు కిషోర్, సురేష్, మెదక్ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు హిమగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సమానత్వానికి బసవేశ్వరుడే దిక్సూచి

* **ట్యాంక్ బండ్ పై ఘనంగా బసవ జయంతి వేడుకలు**
* **బీసీల అభ్యున్నతికి కవిత కృషి అభినందనీయం: అల్లంపల్లి రామకోటి**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (భారత శక్తి): మధ్యయుగ కాలంలోనే కులరహిత, వర్గ రహిత సమాజ స్థాపనకు పునాదులు వేసిన మహా విప్లవకారుడు మహాత్మా బసవేశ్వరుడు అని పలువురు వక్తలు కొనియాడారు. బసవేశ్వరుడి 839వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ పై ఉన్న ఆయన విగ్రహానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లంపల్లి రామకోటి, బలిజ కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

* **సమానత్వమే పరమావధి: కల్వకుంట్ల కవిత**

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కల్వకుంట్ల కవిత, బసవేశ్వరుడి బోధనల ప్రాముఖ్యతను వివరించారు. "839 ఏళ్ల క్రితమే బసవన్న ఒక సామాజిక విప్లవానికి నాంది పలికారు. అప్పట్లోనే 'అనుభవ మంటపం' ద్వారా ప్రజాస్వామ్య విలువలను ప్రపంచానికి పరిచయం చేశారు. కుల, వర్ణ, లింగ భేదాలు లేని సమాజం కోసం ఆయన చేసిన కృషి నేటికీ స్ఫూర్తిదాయకం. సమాజంలోని అజ్ఞానం, పేదరికం, అమాయకత్వాన్ని నిర్మూలించడమే





ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి" అని ఆమె పేర్కొన్నారు.

* **సామాజిక మార్పు దిశగా కొత్త అడుగులు**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లంపల్లి రామకోటి రాజకీయ, సామాజిక పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

* మహిళా నాయకత్వం అవశ్యకత: రాష్ట్రంలో అవినీతి రహిత, పారదర్శక పాలన సాగాలంటే మహిళా నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. పేదరిక నిర్మూలన, మానవత్వంతో కూడిన పాలన కల్వకుంట్ల కవిత వంటి నాయకురాలితోనే సాధ్యమని పేర్కొన్నారు.
* బీసీల ఐక్యత: బీసీల హక్కుల కోసం కవిత గొంతుక వినిపించినప్పటి నుండి గ్రామ స్థాయిలో వెనుకబడిన వర్గాలలో చైతన్యం పెరిగిందని, వారు రాజకీయంగా ఏకమవుతున్నారని రామకోటి విశ్లేషించారు.
* రాజకీయ మలుపు: ఈ నెల 25న ఆవిర్భవించబోయే నూతన రాజకీయ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారతాయని ఆయన జోస్యం చెప్పారు. పదవుల కంటే ప్రజా సంక్షేమమే మిన్నగా భావించే నాయకత్వాన్ని ప్రజలు ఆదరిస్తారని వెల్లడించారు.

**బసవన్న స్ఫూర్తి - నేటి అవసరం**

12వ శతాబ్దంలో బసవేశ్వరుడు ప్రతిపాదించిన 'కాయకవే కైలాస' (శ్రమయే ముక్తి) అనే సిద్ధాంతం నేటి ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం వంటిది. విగ్రహారాధన కంటే మానవత్వమే మిన్న అని చాటిన ఆయన ఫిలాసఫీని ప్రస్తుత సమాజం అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రస్థానంలో సామాజిక న్యాయం జరగాలంటే బసవన్న ఆశయ సాధనే మార్గమని సభ ముక్తకంఠంతో చాటింది.

# ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో అగ్ని ప్రమాదం

జిన్నారం: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక పారిశ్రామిక వాడలోని ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో బాయిలర్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పేందుకు పరిశ్రమలో ఎలాంటి పరికరాలు లేవని స్థానికులు తెలిపారు. దీంతో ఒక్కసారిగా మంటలు తీవ్రంగా వ్యాపించాయి. ఇదే పరిశ్రమకు ఆనుకొని మరో భారీ పరిశ్రమ ఉండటంతో అక్కడి నుంచి సేఫ్టీ విభాగం రసాయనాలు వెదజల్లారు. అగ్నిమాపక వాహనం అందుబాటులో లేకపోవడం వల్లనే సమస్య తీవ్రమైందని స్థానికులు తెలిపారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.